
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
5
జిల్లా వార్తలు
మంగళవారం 20 మే 2025



తుంగలో తొక్కేశారు..!

- ఇసుకను తోడేస్తున్న తెలుగు తమ్ముళ్లు
- పేదలకు అందాల్సిన ఇసుకను అక్రమంగా తరలింపు
- మంత్రాలయంలో తుంగభద్ర నదిపై టీడీపీ నేతల కన్ను
- ఆదోని సబ్ కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

వైసీపీ పాలనలో పేదల సొంతింటి కల.. కలగానే మిగిలింది. ఇసుక ధర అధికంగా ఉండడంతో చాలా మంది ప్రజలు ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రాలేదు. అయితే ప్రతి పేదవాడు ఇల్లు నిర్మించుకోవాలన్న ఉద్దేశంతో పేదలకు ఉచితంగా ఇసుకను అందించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. అయితే ఆ లక్ష్యాన్ని తెలుగుతమ్ముళ్లు తుంగలో తొక్కేశారు. మంత్రాలయంలోని తుంగభద్ర నది నుంచి ఇసుకను రాత్రికి రాత్రే అక్రంగా తోడేసి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. ఇసుకను ఇలా అక్రమంగా తరలిస్తే పేదలకు ఎక్కడ దొరుకుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



తుంగభద్ర నది నుంచి ట్రాక్టర్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న దృశ్యం

మంత్రాలయం, మే 19 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అధికార పార్టీకి చెందిన నాయకులు తుంగభద్రలోని ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందించాలన్న సదుద్దేశంతో ముందుకెళ్తుండగా.. ఇక్కడ మాత్రం అధికార పార్టీ నాయకులే ఉచిత ఇసుక పేరుతో లాడ్జీలు, హోటళ్లు, పెద్ద భవంతులకు ఇసుకను రవాణా చేస్తున్నారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ స్వయంగా నదిలోకి వెళ్లి అక్రమ ఇసుక తోడుతున్న ప్రదేశాన్ని పరిశీలించి అక్కడే రెవెన్యూ, పోలీసులకు ఆదేశాలు జారీ చేసినా ఇక్కడ తెలుగు తమ్ముళ్లు మాత్రం ఈ ఆదేశాలు పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. కొంత మంది తెలుగుతమ్ముళ్లు ట్రాక్టర్లను అద్దెకు తీసుకుని అధికారులను గుప్పెట్లో పెట్టుకుని తమ మాట వినకుంటే నాయకుల నుంచి ఫోన్లు చేయించి ఇసుక దందాకు తెరలేపారు. చీకటి పడితే చాలు మంత్రాలయం పుణ్యక్షేత్రంలో సుంకప్ప తాత దర్గా వద్ద, రాగసుధ, ఎస్‌పీ ఘాట్, చెట్నపల్లి వద్ద పాత చాపల చెరువు, మాధవరం బ్రిడ్జి వద్ద ఇసుకను తుంగభద్రలో ఇసుకను తోడేస్తున్నారు. రోజుకు 30 ట్రాక్టర్లకు పైగా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నా, రెవెన్యూ, పంచాయతీ పోలీసులు అడిగే వారేలేరు. వర్షం వచ్చి మళ్లీ తుంగభద్ర నదికి వరద వస్తే ఇసుకకు డిమాండ్ ఉంటుందనే ముందు జాగ్రత్తగా తెలుగు తమ్ముళ్లు నది ఒడ్డున స్టాక్ పాయింట్‌తో డంప్ చేస్తున్నారు. ఇప్పటికే ఒక్కో ట్రాక్టరు ఇసుకను రూ.2,500 నుంచి రూ.3 వేల వరకు అమ్ముతూ రోజుకు పదుల సంఖ్యలో విక్రయిస్తూ రూ.లక్షల్లో ధనార్జనే ధ్యేయంగా అక్రమంగా సంపాదిస్తున్నారు. పోలీసు అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై పలువురు మండిపడుతున్నారు. రెవెన్యూ అధికారులు కాపలాగా పెట్టిన వీఆర్‌ఏలకు అక్రమార్కులు ట్రాక్టరుకు రూ.1000 మామూళ్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నదిలోకి వెళ్లాలంటే రైతుల పొలాలను దాటుకొని వెళ్లాలి. ఈ పొలాల్లో వెళ్లడానికి అక్రమార్కులు దారి ఇచ్చిన ఒక్కో రైతుకు నెలకు రూ.10 వేలు చెల్లిస్తున్నట్లు సమాచారం. పొలం దెబ్బతింటుందని రైతు ఒప్పుకోకపోతే టీడీపీ నాయకుల నుంచి ఫోన్ల ద్వారా ఒత్తిడి తెచ్చి అక్రమ ఇసుకకు మార్గం సుగమం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గ్రామ అధికార పార్టీ నాయకులే అక్రమ ఇసుక రవాణాకు తెర లేపడంతో మంత్రాలయం, చెట్నహల్లి, మాదవరంలో ఇసుక డంప్‌లు భారీగా దర్శనం ఇస్తున్నాయి. మంత్రాలయం ట్రాక్టర్లు 6, చిలకలడోన 6, కల్లుదేవకుంట 2, సూగూరు 4, మాధవరం 5, చెట్నహల్లి 8 ట్రాక్టర్లు నిత్యం అక్రమ ఇసుకను తోడేస్తున్నారు. మంత్రాలయం నుంచి ఎమ్మిగనూరుకు ఒక్కో ట్రాక్టరు ఇసుకను రూ.4వేల నుంచి రూ.5 వేలకు తరలిస్తున్నారు.



నది ఒడ్డున ఇసుక డంప్ చేసిన తెలుగు తమ్ముళ్లు



తుంగభద్ర నదిలో ఇసుకను తవ్విన ప్రదేశం



● రాత్రి సమయంలో గస్తీ పెంచాం

మంత్రాలయం నుంచి అక్రమంగా రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తీసుకుంటాం. వీఆర్వోలు, వీఆర్‌ఏలతో రాత్రి పూట గస్తీ పెంచాం. ఇసుక కోసం నదిలో వెళ్లే దారిలో గోతులు తీసి ట్రాక్టర్లు వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నాం. లాడ్జీలు, హోటళ్లు, పెద్ద పెద్ద భవంతులకు ఇసుక అక్రమంగా తరలిస్తే సీజ్ చేస్తాం. ఇసుక డంప్‌లు త్వరలో గుర్తించి సీజ్ చేస్తాం.

\- ఎస్.రవి, తహసీల్దార్, మంత్రాలయం



మంత్రాలయంలో లాడ్జిల కోసం డంప్ ఉంచిన ఇసుక

అక్రమంగా తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తాం



తుంగభద్ర నది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేస్తాం. రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు నడుచుకోవాలి. పెద్ద పెద్ద భవంతుల నిర్మాణాలకు మంత్రాలయం నది నుంచి ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేసి తహసీలార్‌కు అప్పగిస్తాం.

\- రామాంజులు, సీఐ మంత్రాలయం

అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం..

కలెక్టర్ అసంతృప్తి

- పదిరోజుల్లో పరిష్కరించాలని ఆదేశం



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్‌ఎస్ లాగిన్‌లో వచ్చిన సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యంపై కలెక్టర్ రంజిత్ బాషా అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. పీజీఆర్ఎస్ లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని చెప్పినప్పటికీ కొన్నిశాఖల అధికారులు వారం, పది రోజులైనా చూడడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సీడీపీవో కర్నూలు అర్బన్, ఆదోని మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ కర్నూలు అర్బన్, డిప్యూటీ కంట్రోలర్, లీగల్ మెట్రాలజీ శాఖలకు సంబంధించి వారం నుంచి పది రోజులైనా అర్జీలను చూడలేదని, అర్జీలను చూడకుంటే ఎలాగని ప్రశ్నించారు. ప్రజల అర్జీలకు సంబంధించి నిర్లక్ష్యం చేయకూడదని, లాగిన్‌లో వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు చూడాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్‌ఎస్ లాగిన్‌లో అర్జీలను ఆడిట్ చేయాలన్నారు. రీసర్వే గ్రామ సభలకు సంబంధించి రీ ఓపెన్ అయిన అర్జీలు వెంటనే పరిష్కరించాలని సర్వే శాఖ అధికారిని ఆదేశించారు. సీఎంవో గ్రీవెన్స్‌లకు సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 20, కర్నూలు ఆర్డీవో వద్ద 10, పత్తికొండ ఆర్డీవో వద్ద 7, సర్వే ఏడీ వద్ద 2, డీఎంహెచ్‌వో, వ్యవసాయశాఖ, మెప్మా, సైనిక సంక్షేమ శాఖ వద్ద ఒక్కొక్కటి చొప్పు అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వెంకటేశ్వర్లు, అనురాధ పాల్గొన్నారు.

మహానాడును విజయవంతం చేయండి

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



కర్నూలు అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కమ్మ సంఘం కల్యాణ మండపంలో ఈనెల 22న జరిగే మహానాడును విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు నిర్వహించే జిల్లా స్థాయి మహానాడు కార్యక్రమానికి అవసరమైన ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే కర్నూలు, కోడుమూరు నియోజకవర్గాల్లో మహానాడు కార్యక్రమాలు పూర్తయ్యాయని, మిగిలిన నియోజకవర్గాల్లో కూడా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహానాడు కార్యక్రమాల్లో ప్రధానంగా జిల్లాకు సంబంధించిన ముఖ్యమైన సమస్యలపైన, అలాగే నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన మహానాడులో చర్చించిన అంశాలపై చర్చించి, వాటిని క్రోడీకరించి జిల్లా స్థాయిలో తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. వాటిని రాష్ట్ర మహానాడు తీర్మానాల్లో పొందు పరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

వరించిన అదృష్టం

- ఆదోని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా సీహెచ్ లోకేశ్వరి
- ప్రమాణ స్వీకారం చేయించిన కమిషనర్



నియామక పత్రాన్ని అందుకుంటున్న సీహెచ్ లోకేశ్వరి

ఆదోని, మే 19(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ చైర్‌పర్సన్‌గా వైసీపీకి చెందిన 42వ వార్డు కౌన్సిలర్ సీహెచ్ లోకేశ్వరి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక ప్రక్రియ సజావుగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎన్నికల అబ్జర్వర్ కర్నూలు జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య, ప్రిసైడింగ్ ఆఫీసర్, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ హాజరయ్యారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ అధ్యక్షతన ప్రక్రియ సాగింది. ఆదోని మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నిక నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం ఆదోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ హాజరయ్యారు. కౌన్సిల్ సభ్యుల సమక్షంలో 42వ వార్డు కౌన్సిలర్ సీహెచ్ లోకేశ్వరి చెర్‌పర్సన్ పదవికి ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. 36వ వార్డు కౌన్సిలర్ సందీప్ రెడ్డి ఆమె పేరును ప్రతిపాదించగా.. 40వ వార్డు కౌన్సిలర్ ఫయాజ్ అహ్మద్ చైర్ పర్సన్‌గా బలపరిచారు. సీహెచ్ లోకేశ్వరి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఆదోని మున్సిపల్ చైర్ పర్సన్‌గా సీహెచ్ లోకేశ్వరిని అధికారులు ప్రకటించారు. ఈ ఎన్నికకు టీడీపీ ఒకటో వార్డు కౌన్సిలర్ పార్వతితో కలిపి 36 మంది వార్డు కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యుడి హోదాలో ఎమ్మెల్సీ మధుసూదన్ హాజరయ్యారు. మొత్తం 42 మంది కౌన్సిలర్లు ఉండగా ఐదుగురు హాజరు కాలేదు. ఒకటో వార్డు టీడీపీ కౌన్సిలర్ పార్వతి హాజరయ్యారు. అయితే వైసీపీకి చెందిన 36 మంది కౌన్సిలర్లు, ఎక్స్ అఫిషియో సభ్యుడు ఎమ్మెల్సీ మధుసూదన్ లోకేశ్వరి మద్దతు తెలపడంతో ఆమె ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చైర్‌పర్సన్ ఎన్నికకు కోరం కన్నా ఎక్కువ మంది సభ్యుల మద్దతు ఉండడంతో చైర్‌పర్సన్ నియామక ప్రక్రియ ముగిసింది. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్‌గా నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన లోకేశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ ప్రమాణ స్వీకారం చేయించారు.

ప్రారంభమైన ఏపీఈఏపీ సెట్

- మొదటి రోజు ఆలస్యంగా వచ్చిన ఆరుగురికి అనుమతి నిరాకరణ
- 190 మంది విద్యార్థుల గైర్హాజరు
- జిల్లాలో 94 శాతం హాజరు నమోదు



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

కర్నూలు ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఏపీఈఏపీ సెట్ పరీక్ష సోమవారం మొదలైంది. ఈ పరీక్ష ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతుంది. మొదటి రెండు రోజులైనా 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల విభాగాల పరీక్ష, 21 నుంచి 27వ తేదీ వరకు ఇంజనీరింగ్ కోర్సుల విభాగాలకు సంబంధించిన ఆన్‌లైన్ పరీక్ష కొనసాగనుంది. ఈ పరీక్ష మొత్తం 14 సెషన్స్‌లలో నిర్వహిస్తున్నారు. ఒక్క నిమిషం ఆలస్యం నిబంధన అభ్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేసింది. కర్నూలు నగరం జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఇద్దరు, సనత్ నగర్‌లోని అయాన్ డిజిటల్ పరీక్ష కేంద్రంలో నలుగురు అభ్యర్థులు ఆలస్యంగా రావడంతో వారిని పరీక్ష నిర్వాహకులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించలేదు. చేసేదేమీ లేక వారు మనోవేదనతో వెనుదిరిగి వెళ్లారు. జిల్లాలోని దూర ప్రాంతంలోని గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు సకాలంలో లేకపోవడంతోనే ఆలస్యంగా కేంద్రానికి వచ్చినట్లు బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. కర్నూలు జిల్లాలో ఏపీఈఏపీ సెట్‌కు మొత్తం 18,743 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగానికి 6,220 మంది, ఇంజనీరింగ్ విభాగానికి 12,473 మంది, రెండింటికి కలిపి 50 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లా మొత్తం 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో కర్నూలు నగరంలో 7 పరీక్ష కేంద్రాలు, ఎమ్మిగనూరు, ఆదోనిలో ఒక్కొక్కటి చొప్పున పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొదటి రోజు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్షకు ఉదయం, మధ్యాహ్నం సెషన్స్‌లలో జరిగిన పరీక్షకు మొదటి రోజు 3,190 మంది అభ్యర్థులు నమోదు చేసుకున్నారు. 3,000 మంది పరీక్షకు హాజరు కాగా, 190 మంది అభ్యర్థులు గైర్హాజరు కావడంతో జిల్లాలో 94 శాతం హాజరు నమోదైంది. మొదటి రోజు పరీక్ష ప్రశాంతంగా ముగిసింది.



సనత్ నగర్‌లోని అయాన్ డిజిటల్ పరీక్షా కేంద్రంలోకి ఆలస్యంగా రావడంతో అధికారులను వేడుకుంటున్న విద్యార్థిని, తండ్రి

‘పది’ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కర్నూలు ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు కొనసాగాయి. కర్నూలు జిల్లాలో మొత్తం అన్ని పరీక్షలకు ప్రైవేటు, రెగ్యులర్, ఓపెన్ స్కూల్ విద్యార్థులు మొత్తం కలిపి 17,129 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 10,861 మంది, ప్రైవేటు విద్యార్థులు 5,532 మంది కాగా, ఓపెన్ స్కూల్ విద్యార్థులు 736 మంది ఉన్నారు. ఈ విద్యార్థుల కోసం జిల్లా వ్యాప్తంగా 69 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు జరిగిన పరీక్షకు పదో తరగతి రెగ్యులర్ విద్యార్థులు 3,436 మం ది నమోదు చేసుకున్నారు. 2,248 మంది హాజరు కాగా.. 1,188 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. దీంతో 65.42 శాతం నమోదైంది. ఓపెన్ స్కూల్ పదో తరగతి విద్యార్థులు 13 మంది నమోదు చేసుకోగా, ఇందులో 12 మంది విద్యార్థులు హాజరు కాగా, ఒకరు గైర్హాజరై 92.30 శాతం హాజరు నమోదైంది. అలాగే ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థులు 102 మంది నమోదు చేసుకోగా, 84 మంది హాజరయ్యారు. ఇందులో 18 మంది గైర్హాజరై 82.35 శాతం హాజరు నమోదైంది. ఈ మూడు విభాగాల్లో 1,207 మంది విద్యార్థులు పరీక్షకు గైర్హాజరయ్యారు.

లెస్ టెండర్లు వద్దు

- అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడేదిలేదు
- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- అధికారులు, కాంట్రాక్టర్లతో సమీక్ష

కర్నూలు న్యూసిటీ, మే 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో నగర పాలక అభివృద్ధి పనులకు సంబంధించి లెస్ టెండర్లు వస్తే సహించేది లేదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ కాంట్రాక్టర్లను హెచ్చరించారు. టెండర్లను దక్కించుకున్న వారు పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సోమవారం కర్నూలు కౌన్సిల్ హాలులో కమిషనర్ రవీంద్రబాబు, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి కాంట్రాక్టర్లతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా కాంటాక్టర్లు చేపట్టిన పనుల పురోగతిపై మంత్రి ఆరా తీశారు. కొందరు పనులు మధ్యలో ఆపేసారని... మరి కొందరు ఇప్పటి వరకు ఎందుకు పనులు ప్రారంభించలేదని ప్రశ్నించారు. తక్కువ కోట్‌కు వర్క్‌లు దక్కించుకుంటే పనుల్లో నాణ్యత ఎలా వస్తుందని మంత్రి ప్రశ్నించారు. తమ ప్రభుత్వం జవాబుదారీతనంతో పని చేస్తుందని, ప్రజలకు మంచి పాలన అందించేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. వార్డుల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. తమకు చెడ్డపేరు తీసుకువచ్చేలా పని చేస్తే చూస్తూ ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. కొందరు కాంట్రాక్టర్లు రాజకీయం చేయాలని చూస్తున్నారని ఇదంతా తాను గమనిస్తున్నట్లు చెప్పారు. కావాలనే పనులు చేయకుండా జాప్యం చేసే వారిని బ్లాక్‌లిస్ట్‌లో పెడతమాన్నారు. తాను రాజకీయం చేస్తే తట్టుకోలేరని మంత్రి హెచ్చరించారు. నెలాఖరులోగా అన్ని పనులు ప్రాంభించాలని, పనులు సకాలంలో పూర్తి కాకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. వారం రోజుల ముందుగానే 42 మంది కాంట్రాక్టర్లను సమావేశానికి పిలిస్తే 18 మంది గైర్హాజరు కావడంపై మంత్రి భరత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరెవరు రాలేదో వారి వివరాలను తనకు పంపాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ సత్యనారాయణ, డీఈఈలు మనోహర్‌రెడ్డి, క్రిష్ణలత, శ్రీనివాసరెడ్డి, గంగాధర్, నరేష్, గిరిరాజు, ఏఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

నేటి నుంచి జిల్లాలో భారీ వర్షాలు 6లో

తుంగభద్రకు జలకళ 6లో

బాధితులకు న్యాయం చేస్తాం: ఎస్పీ



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులు న్యాయం చేసి సమస్యలు త్వరితగతిన పరిష్కరిస్తానని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. నగరంలోని కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి మొత్తం 128 ఫిర్యాదులు వచ్చాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ హుస్సేన్‌పీరా, లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సీఐలు ఉన్నారు.

వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..

- కర్నూలు నగరంలోని జొహరాపురానికి చెందిన శ్రీనివాసులు, క్రిష్ణగిరి గ్రామానికి చెందిన ఆవుల రామాంజనేయులు కలిసి ఏడుగురి నుంచి మొత్తం సుమారు రూ.10 లక్షల వరకు డబ్బులు తీసుకున్నారని డోన్ మండలానికి చెందిన ఎరుకుల శేషన్న ఫిర్యాదు చేశారు. నకిలీ పత్రాలు ఇప్పించి పాఠశాల్లో కాంట్రాక్టు ఉద్యోగాలు ఇప్పించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఓర్వకల్లు మండలం కన్నమడకల గ్రామానికి చెందిన రామకృష్ణ అనే వ్యాపారి 95 సేర్ల నకిలీ ఉల్లి విత్తనాలు ఇచ్చి పలువురు రైతులను మోసం చేశారని కడప జిల్లా పెండ్లిమర్రి గ్రామానికి చెందిన నాగ మల్లారెడ్డి ఫిర్యాదు చేశారు. తన తమ్ముడు విరుపాక్షితో బంగారు ఆభరణాలను కర్నూలు ఎఫ్ఈడీ బ్యాంకు సర్వీసు ప్రైవేటు లిమిటెడ్‌లో తాకట్టు పెట్టి లోన్ తీసుకున్నామని, అప్పు తిరిగి చెల్లించేందుకు వెళ్లగా.. బంగారు ఆభరణాలు రిలీజ్ చేసి ఇచ్చినట్లు చెబుతున్నారని, న్యాయం చేయాలని కర్నూలు మండలం నిడ్జూరు గ్రామానికి చెందిన టి.నాగేశ్వరరెడ్డి ఫిర్యాదు చేశారు. తన పొలానికి రస్తా లేదంటూ తన తమ్ముళ్లు శ్రీరాములు, రాముడు, నరసింహులు అడ్డుపడుతున్నారని కర్నూలు మండలం జి.సింగవరం గ్రామానికి చెందిన ఈ.మద్దిలేటి ఫిర్యాదు చేశారు. తమ కోడలు సంధ్య మమ్మల్ని సరిగ్గా చూసుకోవడం లేదని గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన కె.లక్ష్మణరావు ఫిర్యాదు చేశారు. ఉల్లిపాయల సరుకు తీసుకొని నంది ఆనియన్ ట్రేడర్స్ వారు డబ్బులు ఇవ్వడం లేదని కర్నూలు నగరంలోని బుధవారపేటకు చెందిన సాంబశివుడు ఫిర్యాదు చేశారు.

రమణీయం.. లక్ష్మమ్మ అవ్వ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

● జనసంద్రమైన ఆదోని ● దర్శించుకున్న ప్రముఖులు

ఆదోని , మే 19 (ఆంధ్రజ్యోతి): మల్లిసంధ్య లేలేత కిరణాలతో సూర్య భగవానుడు ఆశీర్వదించగా పండితులు వేదమంత్రాలు వల్లిస్తుండగా శుభకర మంగళ వాయిద్యాలతో ఉత్సవమూర్తి మహాయోగి లక్ష్మమ్మ అవ్వను పరిమళపూలతో ప్రత్యేకంగా అలంకరించిన వెండి రథంపై ఆశీనులు గావించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. అవ్వ రథోత్సవం కన్నులారా తిలకించేందుకు భక్తజనం వెయ్యికళ్లతో ఎదురుచూస్తుండగా శుభ ముహూర్తం సాయంకాల సంధ్యావేళ 3.00 గంటలకు మహారథం చక్రాలు కదిలాయి. ఒక్కసారిగా జయహో లక్ష్మాంబికాదేవి జయహో జయహో లక్ష్మమ్మ అవ్వ జయహో అంటూ అవ్వ నామ స్మరణంతో పురవీధులు భక్తితత్వంతో ప్రతిధ్వనించాయి. ఆధ్యాత్మికత శోభిల్లింది. ఆదోని పట్టణంలో సోమవారం మహాయోగి లక్ష్మమ్మవ్వ జాతర మహోత్సవం, వెండి మహారథోత్సవం కన్నుల పండుగగా సాగింది. బ్రాహ్మణ వీధి నుంచి ప్రారంభమైన అవ్వ రథోత్సవం హవన్నపేట కూడలి, బుడ్డేకల్ సర్కిల్, పూల బజార్, షరాఫ్ బజార్ మీదుగా సాగి యథాస్థానం చేరుకోవడంతో ఉత్సవం ముగిసింది. అడుగడుగునా భక్తులు అవ్వ రథానికి టెంకాయలు సమర్పించి పూజలు చేశారు. ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో పురవీధులు జన సందోహంగా మారాయి. ఎటు చూసినా జాతర కోలాహలమే.

ప్రత్యేక పూజలు

ఆరాధన, జాతర మహోత్సవాన్ని పురస్కరించుకొని మహాయోగి లక్ష్మమ్మ అవ్వ మూల బృందావనానికి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెచ్చిన పరిమళాలు వెదజల్లే ప్రత్యేక పూలతో అలంకరించారు. ఉదయం ఐదు గంటలకే అవ్వను దర్శించుకుని మోక్ష ప్రాప్తి పొందేందుకు జిల్లా నలుమూలల నుంచి కాకుండా కర్ణాటక, తెలంగాణ, తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున భక్తజనం తరలివచ్చారు. పెద్ద ఎత్తున బారులు దీరారు. ఉత్సవాల సందర్భంగా అవ్వకు అభిషేకం, ఆకుల పూజలు, కుంకుమార్చన, బిల్వార్చన, మహా మంగళ హారతి తదితర విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త, మాజీ ఎమ్మెల్యే రాచోటి రామయ్య ఆధ్వర్యంలో ఉత్సవాలు సాగాయి. సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అవ్వ ఆలయం చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దేవిశెట్టి ప్రకాష్, డీఎస్పీ హేమలత అవ్వను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల నుంచి తరలివచ్చిన భక్తులకు పట్టణంలో ప్రతిచోట అన్నదానంతో పాటు మజ్జిగ, తాగునీటిని ఏర్పాటు చేశారు. ముందుగా లక్ష్మమ్మ అవ్వ పుట్టినిల్లు అయిన ముసానహళ్లి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పల్లకి ద్వారా భజనలతో ఆలయం చేరుకొని పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని డీఎస్పీ హేమలత ప్రారంభించారు.

నూతన జంటలే అధికం

లక్ష్మమ్మ అవ్వను దర్శించుకునేందుకు కొత్తగా పెళ్లయిన వందలాది జంటలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి కలశం చూసిన తర్వాతే ఏ శుభకార్యానికైన వెళ్ళవచ్చనేది నానుడి. కలలశం చూడకుండా ఏ కార్యానికి పాల్గొనడానికి వీలుండదని పెద్దలు చెబుతున్నారు. దీంతో పెద్ద ఎత్తున తరలివచ్చి కలశం చూసిన అనంతరం అవ్వ సన్నిధిలో పూజల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



కలశాలతో మహిళలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మమ్మ అవ్వ

పోలీసులు భారీ బందోబస్తు

లక్ష్మమ్మ అవ్వ జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా డీఎస్పీ హేమలత పర్యవేక్షణలో సీఐలు శ్రీరామ్, రాజశేఖర్ రెడ్డి, రామలింగమయ్య, ఆస్పరి సీఐ మస్తాన్ వలి, ఎస్సై, పోలీసులతో భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడే బారికేడ్లను ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను మళ్లించారు.

డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. 2015-18 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులకు ఇటీవల స్పెషల్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించారు. ఆ ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచామని తెలిపారు. ఈ సమాధాన పేపర్ల రీవాల్యూయేషన్ కోసం ఈనెల 30లోపు తగిన రుసుం చెల్లించి ఆయా కళాశాలల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

'జియో మైసూర్' 595.67 ఎకరాలు

● గత కేటాయింపుల్లో 164.02 ఎకరాలు తొలగింపు

కర్నూలు అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): జియో మైసూర్ సర్వీసు ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు 595.676 హెక్టార్ల భూమికి 30 ఏళ్ల లీజులను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని తుగ్గలి మండలంలోని జొన్నగిరి, గోంతలపల్లి, పగిడిరాయి, వై.ఎర్రగుడి గ్రామాల్లో బంగారు, వెండి, సీసం, జింక్ ఖనిజాల తవ్వకాలు, శుద్ధి కోసం అనుమతులు మంజూరు చేసింది. గతంలో 597.820 హెక్టార్లు కేటాయించగా అందులో సరైన పద్ధతిలో కేటాయించలేదన్న ఫిర్యాదు మేరకు డీజీపీఎస్ సర్వేల్లో తేడాలు రావడంలో 164.02 ఎకరాల భూమిని తొలగించారు. రెవెన్యూ, గనుల శాఖ అధికారుల తనిఖీల తర్వాత మైనింగ్ లీజులో మార్పులు చేస్తూ మౌలిక ప్రమాణాలు పాటించాలన్న నిబంధనలతో ఆదేశాలు జారీ అయ్యాయి. 2023లో కంపెనీ ప్రతినిధులు కొంత భూమి వివరాలు సరైన పద్ధతిలో లేవని పేర్కొనడంతో కొత్తగా చేసిన సర్వే ప్రకారం కొంత భూమిని తొలగించినట్లు మైనింగ్ అండ్ జియోలాజికల్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

22న హనుమజ్జయంతి వేడుకలు

కర్నూలు కల్చరల్, మే 19(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 22న హనుమజ్జయంతి సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ఐదు ఆలయాల్లో హనుమజ్జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకుడు డాక్టర్ మల్లు వేంకట రెడ్డి తెలిపారు. సోమవారం ఆయా ఆలయాల వద్ద హనుమజ్జయంతి నిర్వహణ వివరాలు తెలియజేసే బ్యానర్లు ఆలయ కమిటీ ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఓర్వకల్లులోని ఆంజనేయస్వామి దేవస్థానం, హొళగుందలోని ఆంజనేయస్వామి దేవాలయం, గోనెగండ్లలోని సీతారామాంజనేయ స్వామి దేవస్థానం, నందికొట్కూరులోని రామాలయం, జూపాడుబంగ్లా మండలం పారుమంచాల గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

● నగర శివారులో డోన్ రోడ్డులోని లక్ష్మీపురం సమీపంలోని జగన్నాథగట్టుపై వెలసిన అభయ ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 22న హను మజ్జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జగన్నాథగట్టు అభివృద్ధి కమిటీ ఆర్గనైజింగ్ కార్యదర్శి మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలి పారు. 22న ఉదయం 8 గంటలకు స్వామి వారికి పంచామృతా భిషేకాలు, హనుమాన్ చాలీసా పారాయణం, సీతారాములకు విశేష పూజలు ఉంటాయని మల్లికార్జునరెడ్డి పేర్కొన్నారు.



నందికొట్కూరు శ్రీరామాలయంలో బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, భక్తులు

నేటి నుంచి జిల్లాలో భారీ వర్షాలు

ఎమ్మిగనూరు రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని అన్ని మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పారు. అలాగే 35కి.మీ. నుంచి 40 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయన్నారు. రైతులు ఐదు రోజుల పాటు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు, రైతులు ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బయటకు రావడం గానీ, చెట్లకిందకు వెళ్లడం గానీ చేయొద్దని సూచించారు.

'యోగాంధ్ర'ను జయప్రదం చేయండి

- కలెక్టర్‌ను ఆదేశించిన సీఎస్

కర్నూలు కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'యోగాంధ్ర-2025' వేడుకలను 21వ తేదీ నుంచి ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలెక్టర్‌ను ఆదేశించారు. సోమవారం సెక్రటేరియట్ నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవం ఏర్పాట్లు, స్టేట్ ప్రాజెక్టు మానిటరింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, కోర్టు సముదాయాలలో మరుగుదొడ్ల నిర్మాణం, ప్రభుత్వ సేవలపై ప్రజాభిప్రాయం అంశాలపై చీఫ్ సెక్రటరీ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 21న యోగా దినోత్సవం కర్టెన్ రైజర్‌గా ప్రతి జిల్లాలో ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి మండలంలోనూ మాస్టర్ ట్రైనర్లను గుర్తించాలన్నారు. మే 21 నుంచి 27 వరకు జిల్లా స్థాయిలో మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ ఉంటుందన్నారు. మే 28 నుంచి జూన్ 3 వరకు మండల స్థాయిలోనూ, జూన్ 4 నుంచి జూన్ 16 వరకు గ్రామ స్థాయిలో ట్రైనర్లకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.

సాధారణ బదిలీలు చేపట్టండి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల నూనెపల్లె, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన ఉత్తర్వుల మేరకు నిబంధనలను అనుసరించి జిల్లా అధికారులు తమ పరిధిలోని ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో సాధారణ బదిలీలు, స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర తదితర కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జేసీ విష్ణుచరణ్, డీఆర్వో రామునాయక్, డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమ వివరాలను ఎప్పటికపుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జూన్‌లో నీరు - మీరు అనే అంశంతో పల్లెపుష్కరిణి కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

నివారణకు టీకా ఒక్కటే మార్గం

తట్టు, రూబెల్లా వ్యాధి నివారణకు టీకా వేయించుకోవడం ఒక్కటే మార్గమని కలెక్టర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నేషనల్ జీరో మిజిల్స్ - రూబెల్లా ఎలిమినేషన్ క్యాంపెయిన్ కార్యక్రమం 2025-26నిర్వహించారు.

ఉత్పత్తులను కొనుగోలు చేయండి

మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల మహిళలచే తయారు చేసి విక్రయిస్తున్న ఉత్పత్తులను కొనుగోలు చేయాలని కలెక్టర్ రాజకుమారి తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మైస్టోర్ యాప్‌లో విక్రయిస్తున్న ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో ఓపెన్‌చేసి జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు.

అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజకుమారి సూచించారు. రానున్న మూడురోజుల్లో జిల్లాలో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల, జిల్లా కార్యాలయాల్లో 24గంటలు కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు కిందిస్థాయి యంత్రాంగాన్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు.

ఆర్డీఎస్ ఆనకట్టకు పోటెత్తిన వరద

కోసిగి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తుంగభద్ర నదిలో నీరులేక నది మొత్తం రాళ్లు తేలి ఇసుకతిన్నెలు కనిపించేవి. అయితే ఐదు రోజుల నుంచి పశ్చిమ ప్రాంతంతో పాటు ఎగువ ప్రాంతమైన కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు కోసిగి మండల పరిధిలోని అగసనూరు సమీపంలో ఉన్న తుంగభద్ర నదిపై ఎగువన ఉన్న ఆర్డీఎస్ (రోజోలిబండ డైవర్షన్ స్కీం)కు వరద పోటెత్తింది. సోమవారం తుంగభద్ర నదిలో ఆర్డీఎస్ ఆనకట్టు మీదుగా వరద నీరు దిగువకు పరవళ్లు తొక్కుతుండటం, వర్షాకాలం ముందే తుంగభద్ర నదికి జలకళ సంతరించుకోవడంతో నదితీర గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నదికి నీరు చేరేది. ఈ ఏడాది మేనెలలోనే వరద పోటెత్తడం గమనార్హం.



ఆర్డీఎస్ ఆనకట్టపై పొంగి పొర్లుతున్న వరద నీరు



ప్రవహిస్తున్న తుంగభద్ర నది



నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



ప్రారంభమైన పుట్టీల ప్రయాణాలు

తుంగభద్రకు జలకళ

● ఆనందంలో రైతులు, భక్తులు
● తాగునీటి కష్టాలు తీరాయన్న అధికారులు
● మంత్రాలయం వద్ద 308.300 నీటి మట్టం నమోదు

మంత్రాలయం, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల మధ్య ఉన్న తుంగభద్ర నది వేసవిలో జలకళ సంతరించుకుంది. ఆదివారం రాత్రి వరకు ప్రవాహం లేని తుంగభద్ర నది సోమవారం ఉదయానికల్లా ప్రవాహం నిండుగా ప్రవహిస్తూ అందరినీ ఆశ్చర్యపరిచింది. కర్ణాటకలోని గంగావతి, సిరిగుప్ప, సిందనూరు, మాన్వి, హగరిలో కురిసిన వర్షాలకు తుంగభద్ర నదిలోకి వంకలు, వాగుల ద్వారా వరద వచ్చి చేరుతోంది. వేసవిలో తాగునీటికి తీవ్ర ఇబ్బందులున్న పరిస్థితుల్లో రెండు మీటర్లకు పైగా నదిలో నీటి ప్రవాహం ఉండటంతో తాగునీటికి ఇబ్బందులు తీరినట్లయింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు మంత్రాలయం వద్ద 308.16 మీటర్ల నీటి మట్టంతో 17,300 క్యూసెక్కులు నీటితో ప్రవహిస్తుంది. ఆదివారం సాయంత్రం 6 గంటలకు 306.470 మీటర్ల నీటి మట్టంతో వెయ్యి క్యూసెక్కులు మాత్రమే ఉండేది. సోమవారం ఉదయం కల్లా 17వేలకు పైగా క్యూసెక్కులు వచ్చి చేరడంతో నదీతీర గ్రామాల్లోని రైతులు రాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చిన భక్తులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత మార్చి ఏప్రిల్, మే నెలల్లో నీరు లేక ఎడారిగా మారిన తుంగభద్ర జలకళను సంతరించుకోవడంతో నదీతీర గ్రామాల రైతులు ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్నారు. రెండు రాష్ట్రాల్లోని భక్తులు మంత్రాలయానికి పుట్టీ(తెప్ప)ల ద్వారా ప్రయాణాలు సాగిస్తున్నారు. మంత్రాలయం నియోజకవర్గంలోని కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం, అలాగే సి.బెళగల్, గూడూరు, సుంకేసుల కర్నూలు వరకు తాగునీటి పథకాలు పునఃప్రారంభమయ్యాయి.

● తాగునీటి సమస్య పరిష్కారమైంది



తుంగభద్రకు వర్షం నీరు రావడంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఊహించని సమయంలో తాగునీటికి ఇబ్బందులు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే సమయంలో ఎగువ ప్రాంతాల్లో వర్షం నీరు తుంగభద్ర నదికి నీరు నిండుగా ప్రవహిస్తుండటం శుభపరిణామం. నదీతీర గ్రామాల్లో దాదాపు తాగునీటి సమస్య పరిష్కారమైనట్లే. రెండు నెలలుగా నీరు లేక నిలిచిపోయిన తాగునీటి పథకాలు పునఃప్రారంభమయ్యాయి. దీంతో ఆయా గ్రామాల్లో దాహార్తి తీరుతుంది.

- పద్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ, ఆదోని

వేదవతి పరవళ్లు

హొళగుంద , మే 19 (ఆంధ్రజ్యోతి): హొళగుంద మండల పరిధి మార్లమాడికి గ్రామం వద్ద ఆంధ్ర, కర్ణాటక సరిహద్దుల్లో వేదవతి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో నదికి వరద పోటెత్తింది. దీంతో గంట గంటకు నీటి మట్టం పెరుగుతోంది. అనంతపురం, రాయదుర్గంతో పాటు కర్ణాటకలోని శివమొగ్గ, సాగర్‌లోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వేదవతి నదికి వరద నీరు భారీగా చేరుతోంది. వరద ఉధృతి ఇలాగే కొనసాగితే ఆంధ్ర, కర్ణాటకకు రాకపోకలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం ఉంది. ఈ క్రమంలో నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.



మార్లమాడికి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వేదవతి నది

'పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'



వృద్ధులకు ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న అధికారి

కర్నూలు కలెక్టరేట్, మే 19(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఉమ్మడి కర్నూలు జిల్లా విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అధికారి రయీస్ ఫాతిమా అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ట్రైసైకిల్‌ను వృద్ధులకు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఇప్పటి వరకు కర్నూలు జిల్లాలో 73 మూడు చక్రాల వాహనాలు, 99 ల్యాప్‌టాప్స్, 27 ఇయర్ హియరింగ్ హెడ్స్, 50 టచ్ ఫోన్స్, 90 ట్రై సైకిళ్లు, 90 కుర్చీలు, 82 వీల్ చైర్లు, 98 సీనియర్ సిటిజన్ స్టిక్స్, 58 బ్లైండ్ స్టిక్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. రోజా మహిళా ఐక్య సంఘం అధ్యక్షురాలు మీసాల సుమలత పాల్గొన్నారు.

సీఐడీ నుంచి పది మంది మాతృశాఖకు

కర్నూలు క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు సీఐడీ రీజినల్ కార్యాలయం నుంచి పది మంది పోలీసులు మాతృశాఖకు బదిలీ చేస్తూ ఆశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు హెడ్ కానిస్టేబుళ్లు, 8 మంది కానిస్టేబుళ్లు మాతృశాఖకు రానున్నారు. కర్నూలు ఎస్పీ కార్యాలయంలో రిపోర్టు చేసుకున్న అనంతరం వీరికి పోలీస్ స్టేషన్లు కేటాయిస్తారు.

మురుగు యార్డు

- కర్నూలు మార్కెట్ యార్డులో చెత్తాచెదారంతో దుర్వాసన
- రహదారులపై మురుగు



కూరగాయల వ్యర్థాలను తింటున్న పశువులు

కర్నూలు అగ్రికల్చర్, మే 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో ఎక్కడ చూసినా మురుగు, చెత్త కనిపిస్తోంది. పంట ఉత్పత్తుల క్రయ విక్రయాల్లో రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన యార్డు ఇలా కావడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసిందంటే కాలు మోపేందుకు వీలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల వ్యర్థాలతో దుర్వాసన

పాడైపోయిన కూరగాయలను ఇక్కడే పాడేస్తున్నారు. అలాగే చెత్తాచెదారం, వాము పొట్టుతో కనీసం కూర్చునే అవకాశంఒ లేదు. రహదారి బురదతో నిండి కుంటలను తలపిస్తున్నాయి. పశువులు, పందులు యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. చెత్తాచెదారం తొలగించి శుభ్రంగా ఉంచాలని అధికారులు ఎంత చెప్పినా కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు, మంత్రులు, ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మార్కెట్ కమిటీ అధికారులే సొంతంగా శుభ్రం చేయిస్తున్నారు. గత వైసీపీ హయాంలో రూ.6 కోట్లు ఖర్చు చేసి నిర్మించిన జంబో ప్లాట్‌ఫారం వర్షపు నీటితో నిండిపోయి పంట ఉత్పత్తులు తడిసిపోతున్నాయి. నిర్మించే సమయంలోనే బేస్‌మట్టాన్ని రోడ్డు కంటే ఎత్తుగా నిర్మిచాలని రైతులు ఎంతగా మొర పెట్టుకున్నా ఇంజనీరింగ్ అధికారులు పట్టించుకోలేదు.



జంబో షెడ్‌లో వర్షపునీరు



అదమరిస్తే అంతే.. బురదతో నిండిన రహదారి



కుంట కాదు.. ఇది కూడా మార్కెట్ యార్డే



యార్డుకు వెళ్లాలంటే బురదలో నడవాల్సిందే

కారు బోల్తా.. ముగ్గురి దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు
- మృతులు కర్ణాటక వాసులు
- శ్రీశైలానికి వెళ్లి వస్తుండగా ఘటన



రోడ్డు ప్రమాదంలో ధ్వంసమైన కారు



మృతులు నవీన్, లోకేశ్, సంతోశ్ (ఫైల్)

ప్యాపిలి, మే 19 (ఆంధ్రజ్యోతి): దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా కారు బోల్తాపడి ముగ్గురు దుర్మరణం పాలైన సంఘటన సోమవారం ప్యాపిలి మండలంలో చోటు చేసుకుంది. మృతులు ముగ్గురు కర్ణాటక రాష్ట్రానికి చెందినవారిగా పోలీసులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం తూముకూరు జిల్లా చిక్కనాయకనాహళ్లి తాలూకా కెంకెర గ్రామానికి చెందిన ఆరుగురు స్నేహితులు సంతోశ్(35), నవీన్(43), లోకేశ్(36), స్వామి, దర్శన్, శశిధర్ కలిసి శ్రీశైలం క్షేత్రానికి దర్శనానికి ప్లాన్ చేశారు. రెండు రోజుల కిందట కేఏ 02ఎంకే 44525 నంబర్‌గల ఇన్నోవా కారులో కర్నూలు జిల్లాలోని మంత్రాలయానికి వచ్చి దర్శనం చేసుకున్నారు. ఆ తర్వాత ఆదివారం శ్రీశైల మల్లన్నను దర్శనం చేసుకుని తిరిగి సొంతూరికి బయల్దేరారు. అయితే అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంట ప్యాపిలి మండలం పోతుదొడ్డి గ్రామ సమీపంలోకి రాగానే వారు ప్రయాణిస్తున్న కారుకు కుక్క అడ్డుగా వచ్చింది. దీంతో అదుపుతప్పి కారు డివైడర్‌ను ఢీకొట్టి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ మధుసూదన్ పోలీసులతో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టి బాధితులను 108 అంబులెన్స్‌లో పోలీసులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన సంతోశ్, నవీన్, లోకేశ్ మృతి చెందగా.. మిగిలిన ముగ్గురు స్వల్పగాయాలతో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై ప్యాపిలి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా అతివేగంతో వస్తున్న కారు కుక్కను తప్పించే క్రమంలో ఉన్నఫళంగా బ్రేక్ వేయడంతో కారు బోల్తాపడినట్లు పోలీసులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

ఇదిలా ఉండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారిలో సంతోశ్ బీజేపీ నాయకుడిగా ఉంటూ కాంట్రాక్ట్ పనులు చేస్తుంటారు. ఈయనకు భార్య లక్ష్మితో పాటు ఒక కుమారుడు సంతానం. అదేవిధంగా లోకేశ్ చిరు వ్యాపారి. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు. నవీన్ కూడా తాళ్లూరు పంచాయతీ మాజీ అధ్యక్షుడు. ఈయనకు భార్య క్యావతో పాటు ఓ కుమారుడు సంతానం.

నకిలీ బిల్లుల వ్యాపారిపై కేసు నమోదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



స్వాధీనం చేసుకున్న నకిలీ బిల్లులు



వ్యాపారి సాయికుమార్

అవుకు, మే 19 (ఆంధ్రజ్యోతి): నకిలీ బిల్లులు సృష్టించి ప్రభుత్వానికి పన్ను చెల్లించకుండా అక్రమ రవాణా చేసి రూ.లక్షలు సొమ్ము చేసుకున్న మేడం సాయికుమార్ అనే వ్యాపారిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈనెల 17వ తేదీన ఆంధ్రజ్యోతిలో అడ్డదారిలో అక్రమ రవాణా కథనం ప్రచురితమైంది. దీంతో నంద్యాల జిల్లా బనగానపల్లె నియోజకవర్గం అవుకు పట్టణానికి చెందిన వ్యాపారి సాయి కుమార్ బండారం బట్టబయలైంది. వివరాలివీ..

అక్రమ మార్గంలో డబ్బులు సంపాదించాలనే దురాశతో వ్యాపారి సాయి కుమార్ కడప జిల్లాలోని కమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ పేరుతో నకిలీ బిల్లులు సృష్టించాడు. ఏకంగా 10 నకిలీ బిల్లులు బయటపడ్డాయి. ఏటా వందల లారీల ధాన్యాన్ని అక్రమంగా రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. గతంలో మాదిరిగానే ఈసారి జిల్లాలో రైతులు పండించిన వరి, జొన్న, శనగ, మొక్కజొన్న పలురకాల పంటల ధాన్యాలను కొనుగోలు చేసి తెలంగాణ, తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక, రాష్ట్రాలకు లారీల ద్వార అక్రమంగా రవాణా చేస్తూ పట్టుబడ్డాడు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్కెట్‌కు వడ్లకు 2 శాతం, మిగతా ధాన్యానికి 1 శాతం పన్ను చెల్లిం చాల్సి ఉంటుంది. నకిలీ బిల్లులతో మార్కెట్ తనిఖీ కేంద్రాల వద్ద ఎలాంటి పన్ను చెల్లించకుండ లారీల ద్వార ధాన్యాన్ని అక్రమంగా తరలిస్తూ లక్షలు సొమ్ము ఆర్జిస్తూ వచ్చాడు. గత కొద్ది రోజుల క్రితం కొనుగోలు చేసిన ధాన్యాన్ని లారీలో తరలిస్తుండగా బేతంచర్ల మార్కెట్ తనిఖీ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ జగదీష్ నకిలీ బిల్లుల బాగోతాన్ని గుర్తించి జేడీ దృష్టికి తీసుకెళ్లాడు. జిల్లా చెక్‌పోస్టుల్లోని రికార్డులను తనిఖీ చేయగా బేతంచర్ల చెక్‌పోస్టు నుంచి నకిలీ బిల్లులతో పలుమార్లు అక్రమ రవాణా జరిగినట్లు గుర్తించారు. డోన్‌కు చెందిన లారీ యజమాని ఇచ్చిన సమాచారంతో అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తి సాయికుమార్‌గా గుర్తించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో బనగానపల్లె మార్కెట్ కమిటీ సెక్రటరీ వెంకటేశ్వరరెడ్డి ఆధారా లతో సాయికుమార్‌పై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ రాజరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

- జనరేటర్ల సాయంతో పునరుద్ధరణ
- ఇదీ స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ దుస్థితి



స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్



క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సబ్ స్టేషన్

కర్నూలు హాస్పిటల్, మే 19 (ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో సమస్యలు తలెత్తుతున్నాయి. గత నెల 19వ తేదీన స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో పూర్తి స్థాయిలో సేవలను వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. అత్యాధునిక భవనాలు, యంత్రాలు ఉన్న ఇక్కడ సిబ్బంది కొరత మాత్రం వేధిస్తుంది. సోమవారం క్యాన్సర్ హాస్పిటల్‌లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరా యం ఏర్పడింది. దీంతో ఉదయం ఏపీఎంఎస్‌ఐడీసీ ఎలక్ట్రికల్ ఇంజనీర్లు, కర్నూలు జీజీహెచ్ ఎలక్ట్రీషియన్లు మరమ్మతులు చేపట్టారు. రూ.120 కోట్లతో అత్యాధునికంగా నిర్మించిన స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌కు విద్యుత్ సమస్య తలెత్తితే మరమ్మతులు చేసే ఎలక్ట్రీషియన్లకు కూడా నియమించలేదు. ఇంత పెద్ద హాస్పిటల్‌కు డైరెక్టర్‌గా ఉన్న అధికారికి పూర్తి స్థాయిలో అధికారాలు బదలాయించలేదు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగితే డైరెక్టర్‌కు సొంతంగా డీజిల్ కొని జనరేటర్‌కు వేయించే అధికారం లేకపోవడం విశేషం. విద్యుత్ సరఫరా లేకపోవడంతో జనరేటర్ డీజిల్ కోసం కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్‌ను 300 లీటర్ల డీజిల్ కోసం క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ అధికారులు అడగాల్సి వచ్చింది. నెల క్రితం వైద్యఆరోగ్య శాఖ మంత్రి ప్రారం భించిన క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో అప్పుడే విద్యుత్ హెచ్‌టీ వైర్లు అప్పుడే తెగిపోవడంపై రోగులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా వైద్య విద్య ఉన్నతాధికారులు, కలెక్టర్ స్పందించి వర్షాకాలంలో క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకు ఎలక్ట్రీషియన్ల నియమకాలు చేపట్టాలని రోగులు కోరుతున్నారు.

ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు వైసీపీకి లేదు

- మినీ మహానాడులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్

నంద్యాల రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు వైసీపీకి లేదని టీడీపీ జిల్లల అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మినీ మహానాడు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి శూన్యమని అన్నారు. ఇప్పటికైనా వారి మాటతీరు మార్చుకుని అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈనెలఖారులో కడపలో జరిగే మహానాడుకు ప్రతి కార్యకర్త సభ్యత్వ కార్డులు వేసుకొని రావాలని కోరారు. అలాగే ఇంకా మంజూరు చేయాల్సిన కార్డులను త్వరగా పంపిణీ చేయాలన్నారు. అనంతరం నంద్యాలలో రోడ్డు వెడల్పు, సమ్మర్ స్టోరేజ్, బీసీ భవన్, మౌలిక వసతులు, వంటి వాటికి తీర్మానం చేశారు. అనంతరం మాజీ మంత్రి ఏరాసు ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ఎన్ఎండీ ఫిరోజ్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో రాష్ట్రం ఇంకా అభివృద్ధి చెందుతుందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో నంద్యాల వైసీపీ ఎమ్మెల్యే నండే ఎమ్మెల్యేగా పేరుపొందారని అన్నారు. వారంలో రెండు రోజులు మాత్రమే ఉండి పోయే వారు అభివృద్ధి ఏం చేస్తారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ తులసిరెడ్డి, ఏవీ సుబ్బారెడ్డి, నంద్యాల టీడీపీ అబ్జర్వర్ పోతురాజు, రవికుమార్, నరహరి విశ్వనాథరెడ్డి, ఏవీఆర్ ప్రసాద్, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల స్వీకరణ

డోన్ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ సంస్థ - సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ(సీపెట్) విజయవాడలో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డైరెక్టర్ అండ్ హెడ్ డా.సీహెచ్ శేఖర్ తెలిపారు. పదో తరగతి విద్యార్హతతో మూడేళ్ల వ్యవధి గల డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ (డీపీటీ), డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ (డీపీఎంటీ), బీఎస్సీ విద్యార్హతతో రెండు సంవత్సరాల వ్యవధి గల పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ- పీపీటీ) కోర్సుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో ఈ నెల 29వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. కోర్సులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంటు ఉంటుందని, సీపెట్ అడ్మిషన్ టెస్టు (క్యాట్)ను జూన్ 8న నిర్వహించి అందులో వచ్చిన ర్యాంకు ఆదారంగా విజయవాడ కేంద్రంలో గల 150 సీట్లను భర్తీ చేస్తామని చెప్పారు. వివరాలకు 8309398357 నెంబరును సంప్రదించాలన్నారు.

ఉపాధి కూలీ మృతి



శివన్న (ఫైల్)

కొత్తపల్లి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రమఠం గ్రామంలో ఉపాధి కూలీ నల్లవల్లి గొల్ల శివన్న(63) తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందాడు. మండల ఉపాధి అధికారి విమలమ్మ తెలిపిన వివరాలివీ.. సోమవారం శివన్న తోటి ఉపాధి కూలీలతో కలిసి గ్రామ శివారులోని ఫీడర్ చానెల్ పనులు చేస్తుండగా.. ఉన్న ఫలంగా తీవ్ర అస్వస్థతకు గురై కళ్లు తిరిగి పడిపోయారు. తోటి ఉపాధి కూలీలు హుటాహుటిన ఎర్రమఠం పీహెచ్‌సీకి తరలించగా.. అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు రెఫర్ చేశారు. అయితే.. తీవ్ర అస్వస్థతకు గురైన శివన్న మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు ఏపీవో తెలిపారు. శివన్నకు భార్య విజయమ్మతో పాటు కుమారుడు శ్రీకాంత్, కూతురు దానమ్మ ఉన్నారు.

ఈతకు వెళ్లి బాలుడు..



చరణ్ (ఫైల్)

ప్యాపిలి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్.రంగాపురం గ్రామంలో సోమవారం ఈతకు వెళ్లి చరణ్(10) మృతి చెందాడు. గ్రామానికి చెందిన రామాంజినేయులు, సునీత దంపతులకు ముగ్గురు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. చరణ్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. వేసవి సెలవులు కావడంతో స్నేహితులతో కలసి గ్రామం సమీపంలోని కుంటకు ఈతకు వెళ్లాడు. ఈత పూర్తి చేసుకొని ఇంటికి బయలుదేరుతున్న సమయంలో చరణ్ కనపడక పోవడంతో తోటి మిత్రులకు అనుమానం వచ్చింది. కుంట సమీపంలోని పొలం ఉన్న రైతులకు పిల్లలు విషయాన్ని తెలిపారు. దీంతో కుంటలో దిగి చూడగా చరణ్ మృతదేహం కనపడటంతో బయటకు తీశారు. కొడుకు మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న తల్లిదండ్రులు బోరున విలపించారు.

రుణభారంతో రైతు ఆత్మహత్య



ప్రకాష్ (ఫైల్)

దేవనకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రైతు ప్రకాష్(48) సోమవారి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు.. మృతుడు తన ఎకరా పొలంతో పాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగుచేశాడు. అయితే నష్టం వచ్చి, దాదాపు రూ.15 లక్షలు అప్పులయ్యాయి. వీటిని ఎలా తీర్చలో తెలియక ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య మంగమ్మ, ఇద్దరు కుతూర్లు, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పోక్సో కేసు నమోదు

బేతంచెర్ల, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగానిపల్లె తండాకు చెందిన హరీష్ నాయక్ అనే యువకుడు ఏడేళ్ల బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడటంతో పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. ఈనెల 18న బాలిక ఆడుకుంటుండగా.. మాయమాటలు చెప్పి మిద్దెపైకి తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశాడని, బాలిక కేకలు వేయడంతో పరారయ్యాడని తెలిపారు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోక్సో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అప్పు తగాదా వల్లే హత్య

- హత్యకేసు నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి

హొలహర్వి, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమృతాపురం గ్రామానికి చెందిన పెద్ద వెంకటేశులు హత్యకు ఆర్థిక లావాదేవీలే కారణమని ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, ఎస్ఐ చంద్ర తెలిపారు. సోమవారం హొలహర్వి పోలీస్‌స్టేషన్‌లో హత్యకేసు నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టి వివరాలను వెల్లడించారు. వివరాల మేరకు.. పెద్ద వెంకటేశులు సమీప బంధువు సోమన్నకు గతంలో రూ.3లక్షలు అప్పు ఇచ్చాడు. అయితే సోమన్న రూ.2లక్షలు మాత్రమే చెల్లించాడు. దీంతో వెంకటేశులు సోమన్నకు చెందిన 3 ఎకరాలను కౌలుకు రాయించుకున్నాడు. వడ్డీ మీద వడ్డీ వసూలు చేస్తూ సోమన్నకు వేధించడంతో తట్టుకోలేక ఊరు వదలి అనంతపురం జిల్లా సెట్టూరు గ్రామానికి వెళ్లి అక్కడ కౌలుకు వ్యవసాయం చేస్తున్నాడు. కాగా వెంకటేశులు వేధింపులు అధికం చేసి, సోమన్న చెల్లించిన రూ.2లక్షలను చేర్చకుండా రూ.3 లక్షలకు కోర్టులో కేసు వేశాడు. వేధింపులు బరించలేక సోమన్న అదే గ్రామానికి చెందిన నటరాజ్‌గౌడ్ సాయంతో కిరాయి హంతకులు హొళగుందకు చెందిన నాగరాజు, కర్ణాటక రాష్ట్రం ఉత్తనూరుకు చెందిన భోగప్ప, ధనుంజయలు, ఈరన్నతో పెద్ద వెంకటేశులును హత మార్చేందుకు రూ.2 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఒప్పందం మేరకు పొలంలో పశువులు మేపుతున్న పెద్ద వెంకటేశులును హత మార్చారు. విచారణ అనంతరం విరుపాపురం గ్రామం బల్గోట బసవేశ్వరస్వామి ఆలయం వద్ద నిందితులను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. కోర్టులో హాజరు పరచి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు.

పిడుగుపాటుకు మేకలు, గొర్రెల మృతి



మేకలు, గొర్రెలతో బాధితులు

ఆదోని రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాండవగల్లు ఆదివారం రాత్రి గ్రామంలో భారీ వర్షంతో పాటు పిడుగు పడి 14మేకలు, గొర్రెలు మృతి చెందాయి. బాధితులు తిక్కయ్య, దాస్, నరసయ్య, గోకర్ణ కథనం మేరకు.. తమ మేకలు, గొర్రెలను మేపడానికి పొలానికి వెళ్లి రాత్రి జీవాలతోపాటు పొల్లాలోనే ఉండిపోయారు. రాత్రి 10గంటల సమయంలో ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది. దీంతో యజమానులు ఇంటికి వచ్చేశారు.ఉదయం వెళ్లి చూడగా 18మేకలు, గొర్రెలు మృతి చెంది కనపించాయి. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు: కమిషనర్



కమిషనర్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

కర్నూలు న్యూసిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కా రానికి చర్యలు తీసుకుంటామని కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్ర బాబు అన్నారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి 26 అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎస్‌ఈ శేషసాయి, ఎంఈ సత్యనారాయణ, టీపీఆర్‌ఓ వెంకటలక్ష్మి, ఆర్‌ఓ జునైద్, శానిటేషన్ సూపర్‌వైజర్ నాగరాజు పాల్గొన్నారు.

గూడూరు: ప్రజా సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. సోమవారం గూడూరులోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ప్రజల నుంచి మూడు అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ భూములకు సంబంధించిన సమస్యలు, పట్టాదారు పాసుపుస్తకాలు, భూముల సర్వే వంటి వాటిపై రైతుల నుంచి అర్జీలు వస్తున్నాయని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని అన్నారు.

పాండురంగయ్యకు సన్మానం



పాండురంగయ్యను సన్మానిస్తున్న ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు కలెక్టరేట్, మే 19(ఆంధ్రజ్యోతి): నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన హెచ్ఎన్ఎస్ఎస్ సర్కిల్-1 సూపరింటెండెంట్ ఇంజనీర్ పాండురంగయ్యకు ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం సూపరింటెండెంట్ ఇంజనీర్ కార్యాలయంలో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఎన్ఎస్ఎస్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలోనగర అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, ఎం. రామకృష్ణ, జిల్లా సంయుక్త కార్యదర్శి కేసీహెచ్ కృష్ణుడు, నగర సంయుక్త కార్యదర్శి మునీర్ అహ్మద్, సబ్ ట్రెజరీ అధికారి కరుణాకర్, ఏపీటీఎస్ఏ సంయుక్త కార్యదర్శి అరవింద్ పాల్గొన్నారు.

కౌలు కార్డు తప్పనిసరి: ఏవో

సి.బెళగల్, మే 19 (ఆంధ్రజ్యోతి): కౌలుకార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ కౌలు రైతులకు సూచించారు. సోమవారం బ్రాహ్మణదొడ్డి గ్రామంలో కౌలు రైతులతో ఆయన సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ పొలాలను కౌలుకు తీసుకున్న ప్రతి రైతు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని, కౌలు కార్డులు లేకుంటే ప్రభుత్వ పథకాలు వర్తించవని అన్నారు. ఈసమావేశంలో ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

22న శ్రీరామాయణ పద్య ప్రవచనం

కర్నూలు కల్చరల్, మే 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని సీతారాముల కల్యాణ మహోత్సవ సమితి ఆధ్వర్యంలో ఈనెల 22న హనుమజ్జయంతి సందర్భంగా నంది అవార్డు గ్రహీత, ప్రవచన కర్త గుర్రపుశాల అంక య్యచే 'శ్రీరామాయణ పద్య ప్రవచనం' కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సమితి నిర్వాహకులు హెచ్‌జీ మహాబలేష్, కలికి మురళి తెలిపారు. 22న సాయంత్రం 5.30 గంటలకు నగరంలోని దామోదరం సంజీవయ్య స్మారక మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్స్‌లో, టూ టౌన్ సీఐ జీవీ నాగరా జారావు సౌజన్యంతో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

జయప్రదం చేయండి

కర్నూలు ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 21న డీఈవో కార్యాలయం వద్ద జరిగే నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. కర్నూలు జిల్లా యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని యూటీఎఫ్, ఏపీటీఎఫ్, పీఆర్‌టీయూ, ఎస్టీయూ, ఆపస్ ఉపాధ్యాయ సంఘాల నాయకులు హెచ్చరించారు.

మినీ మహానాడుకు తరలిరండి

ఓర్వకల్లు, మే 19(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఏఎంఆర్ కన్వెన్షన్ హాలులో మంగళవారం జరిగే నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు కార్యక్రమానికి ఓర్వకల్లు మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి హాజరవుతారన్నారు.

నాసిరకం విత్తనాలను విక్రయిస్తే చర్యలు

సి.బెళగల్, మే 19(ఆంధ్రజ్యోతి): రైతులకు నాసిరకం విత్తనాలను విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ విత్తన దుకాణ యజమానులను హెచ్చరించారు. సోమవారం సి.బెళగల్‌లోని విత్తన దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాక్ వివరాలను నోటీసు బోర్డులో నమోదు చేయాలని, రైతులకు బిల్లులను తప్పనిసరిగా ఇవ్వా లని దుకాణ యజమానులకు సూచించారు. ఏవో వెంట ఎంపీఈవోలు వెంకటేశ్, ఈశ్వర్ ఉన్నారు.

లూజు పత్తి విత్తనాలు కొనవద్దు



రైతులతో మాట్లాడుతున్న ఏవో రవిప్రకాష్ గౌడ్

కోడుమూరు రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): రైతులు లూజు పత్తి విత్తనాలు కొని మోసపోవద్దని వ్యవసాయాధికారి రవిప్రకాష్ గౌడ్ తెలిపారు. సోమవారం గోరంట్ల గ్రామంలో రైతులతో మాట్లాడుతూ పొలం విస్తీర్ణం మేరకే కొనుగోలు చేయాలని, ఇళ్లలో ఎక్కువ మొత్తంలో నిల్వ ఉంచకూడదన్నారు. అనుమతులు లేని విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పారిశుధ్య పనులు చేపట్టండి

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య పనులను చేపట్టండని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ పారిశుధ్య పర్యవేక్షక సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కౌన్సిల్ హాలులో కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి పారిశుధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు, మేస్త్రీలతో కలిసి పారిశుధ్యంపై మంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ నగరంలో పారిశుధ్యంపై ఫిర్యాదులు ఎక్కువ అయ్యాయని, వాటిపై పర్యవేక్షక సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పారిశుధ్యంలో విశాఖపట్టణం తరహాలో నగరాన్ని తీర్చిదిద్దాలని, అందుకు అవసరమైన చర్యలు తీసు కోవాలని అన్నారు. గార్బేజ్ పాయింట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు, కూడళ్లపై బ్యానర్లు, పోస్టర్లు అతికించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్లలేకపోతే తన వాట్సాప్ నెంబరుకు పంపాలని మంత్రి తన నెం బరును పారిశుధ్య పర్యవేక్షలకు ఇచ్చారు. అనంతరం కమిషనర్ రవీంద్రబాబు మాట్లాడుతూ పారిశుధ్యం, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక విభాగాల సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు. ఇంటింటి చెత్తసేకరణ వంద శాతం చేపట్టాలన్నారు. రహదారులు, మురుగుకా లువల్లో చెత్తాచెదారం వేస్తే కలిగిఏ అనర్థాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నగరంలో వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మురుగు కాలువల్లో ఉన్న తాగునీటి పైప్‌లైన్ తొలగించేందుకు ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కొందరు శానిటరీ సెక్రటరీలో ఉదయం మస్టర్ వేసిన వెంటనే సచివాలయంలో వెళ్లి నిద్రపోతున్నారని తన దృష్టికి వచ్చిందని పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కె.విశ్వేశ్వరరెడ్డి, శానిటేషన్ సూప ర్‌వైజర్ నాగరాజు, ఇంచార్జి ఎస్‌ఈ శేషసాయి, ఎంఈ సత్యనారాయణ, పట్టణ ప్రణాళిక సర్వేయర్ నాగరాజు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి



సుందరయ్య విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సీపీఎం జిల్లా కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి కృషి చేసిన మహనీయుడు సుందరయ్య అని కొనియాడారు. కార్యక్రమంలో ఆనంద్‌బాబు, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్య దర్శి సి.గురుశేఖర్, సి.రాముడు పాల్గొన్నారు.

● కొత్తబస్టాండు సుందరయ్య కూడలిలో సీపీఎం న్యూసిటీ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, కేవీపీఎస్ నగర కార్యదర్శి భాస్కర్, మల్లికార్జున, విష్ణుమూర్తి, విజేయుడు హాజరయ్యారు.

● కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ, యూనియన్ గౌరవ అధ్యక్షుడు టి.రాముడు, నగర కార్యదర్శి సీహెచ్.సాయిబాబా పాల్గొన్నారు.

ఓర్వకల్లు: మండలంలోని బైరాపురం గ్రామంలో సోమవారం ఉపాధి పనుల వద్ద వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో డీవైఎఫ్ఐ నాయకులు మహేష్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆదినారాయణ, ఉపాధి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

కోడుమూరు: స్థానిక సీపీఎం కార్యాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సోమవారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు గఫూర్‌మియా మాట్లాడుతూ ధనిక కుటుంబంలో జన్మించిన పుచ్చలపల్లి సుందరయ్య విద్యార్థి దశలో పోరాటం చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వీరన్న, శ్రీరాములు, గిడ్డయ్య, నాగరాజు, లక్ష్మన్న పాల్గొన్నారు.





కోడుమూరులో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు, ఓర్వకల్లు మండలం బైరాపురంలో..

ల్యాప్‌టాప్‌లను వినియోగించుకోవాలి

కలెక్టర్ రంజిత్ బాషా



ల్యాప్‌టాప్‌లు అందజేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, మే 19(ఆంధ్రజ్యోతి): ల్యాప్‌టాప్‌లను వినియోగించుకొని నైపుణ్యాలు పెంచుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటో రియంలో విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ద్వారా మంజూరైన ల్యాప్‌టాప్‌లను ఇద్దరు విద్యార్థినులకు కలెక్టర్ అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్, డిగ్రీ తదితర ప్రొఫెషనల్ కోర్సులు చేస్తున్న అర్హులైన విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లను అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకులు రయీస్ ఫాతిమా పాల్గొన్నారు.

● తనకు సర్వే నెంబరు.181/1లో 6 ఎకరాల 20 సెంట్లు భూమి ఉందని, దానిని గ్రామంలోని వేరే వారు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని, మా భూమిని ఇప్పించాలని గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు గ్రామానికి చాకలి నరసింహులు కలెక్టర్‌ను కోరారు.

● మాకు మాలపల్లి గ్రామ పొలిమేరలో సర్వే.నెంబరు.93/బిలో 58 సెంట్లు భూమి ఉందని మంత్రాలయం మండలం మాలపల్లి గ్రామ నివాసి చాకలి భీమన్న తెలిపారు. ఆ భూమి నా పేరు మీద రిజిస్ట్రేషన్ అయి ఉంది. కానీ ఈ భూమి 22ఏ నిషిద్ధ భూముల జాబితాలో చేర్చారు. దానిని నిషిద్ధ భూముల జాబితా నుంచి తొలగించాలని కోరారు.

సిద్ధేశ్వరం ప్రాజెక్టు సాధన కోసం తరలిరండి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు

కల్లూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిపై సిద్ధేశ్వరం అలుగు ప్రాజెక్టు సాధనకు తరలిరావాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వాడాల చంద్రశేఖర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం కల్లూరు మండలం చిన్నటేకూరులో సంఘం నాయకులు పోస్టర్‌ను విడుదల చేశారు. రాయలసీమ సస్యశ్యామలం కావాలంటే సాగునీరు చాలా ముఖ్యమని, కృష్ణానదిపై సిద్ధేశ్వరం అలుగు నిర్మాణాన్ని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ నెల 31న అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యవేదిక రామకృష్ణారెడ్డి, చిన్నటేకూరు మాజీ సర్పంచ్ శేషగిరి, మాజీ మండల ఉపాధ్యక్షుడు కె.రామాంజనేయులు, ప్రజాపరిరక్షణ సమితి నాయకుడు డేవిడ్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేస్తున్నాం: ఎంపీ



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎంపీ నాగరాజు

కర్నూలు అర్బన్, మే 19(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నారని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. సోమవారం నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో ఖ్యాతి స్టడి సర్కిల్ ఆధ్వర్యంలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డీఎస్సీ అభ్యర్థులకు ఉచితంగా స్టడి మెటీరియల్ అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తక్షణమే మెగా డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల పిన్సిపాల్ ఆదినారాయణరెడ్డి, ఉచిత శిక్షణ ట్రైనర్ కళ్యాన్ కుమార్, డీఎస్సీ అభ్యర్థులు పాల్గొన్నారు

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



సంచార చికిత్స కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు

గూడూరు మే 19(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. సోమవారం గూడూరు మండలం పోన్నకల్ గ్రామంలో సంచార చికిత్స కార్యక్ర మాన్ని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులో పెళ్లిళ్ళు చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టనిస్ట్ ఖలీల్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన అవసరం

కోడుమూరు రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నివారణపై అవగాహన అవసరమని సంచార చికిత్స జిల్లా నోడల్ అధికారి రఘు తెలిపారు. మండలంలోని కొత్తూరులో సోమవారం మహిళలకు గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. లైంగిక చర్యల్లో నొప్పి, రక్తస్రావం, బరువు తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. డాక్టర్ అఫాన్‌మహ్మద్ సిబ్బంది వెంకటేశ్వరమ్మ, కుమారి, ఖలీల్ పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మాజీ ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు క్రైం, మే 19 (ఆంధ్రజ్యోతి) : పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సోమవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను కలిశారు. తనకు అదనంగా గన్‌మెన్లు కేటాయించాలని కోరినట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్యేలకు గన్‌మెన్లు కేటాయించాలని ఇటీవల హైకోర్టు ఉత్తర్వులు ఇవ్వగా.. ఆ ఉత్తర్వుల కాపీని ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు అందించినట్లు సమాచారం.

నేటి నుంచి వెంకటగిరిలో హనుమజ్జయంతి



ఎమ్మెల్యేకు ఉత్సవాల కరప్రతం ఇస్తున్న టీడీపీ నాయకులు

కోడుమూరు రూరల్, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరిలో మంగళవారం నుంచి గిడ్డాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ఈనెల 20న విష్వక్సేనపూజ, పుణ్యాహావాచనం, అంకురార్పణ, స్వామికి నివేదన, మంగళహారతి 21న పంచామృతాభిషేకం, ఆకుపూజ, సహస్ర నామార్చన, ప్రభోత్సవం 22న గిడ్డాంజనేయస్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆలయ చైర్మన్‌గా డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. అలాగే ఈనెల 22, 23 తేదీల్లో వివిధ ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. 22న ఉదయం పరుగుపందెం, స్పీడ్ సైకిల్ పందెం, రాత్రి రేలారే రేలా జానపద కార్యక్రమం, మిమిక్రీ, 23న రంగవల్లుల పోటీ ఏర్పాటు చేశారు. విజేతలకు దాతల సహకారంతో నగదు బహుమతి అందజేస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఈ వేడుకలకు ఆహ్వానిస్తూ సోమవారం గ్రామ టీడీపీ నాయకులు రాజు, నారాయణ, గంగాధర్, పెద్దగిడ్డయ్య ఉత్సవాల కరపత్రం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి అందించారు.

అప్రమత్తంగా ఉండాలి



నీటి తొట్టిలో వేస్ట్ ఆయిల్ వేస్తున్న మలేరియా అధికారులు

కల్లూరు, మే 19(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మలేరియా జోనల్ ఆఫీసర్ డాక్టర్ కె.లక్ష్మణ్ నాయక్ సూచించారు. సోమవారం కల్లూరు మండలం ఉలిందకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఉలిందకొండ గ్రామంలో పర్యటించి పరిసరాలను పరిశీలించారు. పంచాయతీ సిబ్బది నీరు నిల్వ ఉన్న చోట ఆబిట్ కామ బిటక్స్ పిచికారి చేయాలని సూచించారు. వేస్ట్ ఆయిల్‌ను డ్రైనేజీ కాలువలో చల్లాలని ఆదేశించారు. నీటి తొట్లు, డ్రమ్ములు, బిందెలతపై మూతలు ఉంచాలన్నారు. కార్యక్రమంలో కర్నూలు జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్, శ్రీధర్ రెడ్డి ఎస్.విజయకుమార్, ఎంపీహెచ్‌ఈవో వెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నీషియన్ వీరాంజనేయులు, ఫార్మాసిస్టు సరిత, స్టాఫ్ నర్సు నాగరాజు, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్, పద్మావతి, హెల్త్ అసిస్టెంట్లు సుభద్రమ్మ పాల్గొన్నారు.

కార్మికులకు జీతాలు పెంచాలి

కర్నూలు న్యూసిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికులకు జీతాలు పెంచాలని ఏపీ మున్సిపల్ ఇంజ నీరింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మనోహర్ డిమాండ్ చేశారు. సోమవారం కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేశారు. మనోహర్ మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరిం చాలని ఆందోళనలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. కార్యక్రమంలో, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కార్యదర్శి సుమీర్ బాషా, రవూఫ్ బాషా, రంగ పాల్గొన్నారు.



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కార్మికులు

బదిలీలకు గ్రీన్ సిగ్నల్

● అనువైన చోటుకు బదిలీ కోసం తీవ్ర ప్రయత్నాలు

● ప్రజాప్రతినిధుల వద్దకు క్యూ కడుతున్న ఉద్యోగులు

కర్నూలు అగ్రికల్చర్, మే 19(ఆంధ్రజ్యోతి): బదిలీలకు అవకాశం ఉండడంతో ఉమ్మడి జిల్లాలో ప్రధాన విభాగాలైన వ్యవసాయ, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ, ఏపీఎంఐపీ, ఇరిగేషన్ తదితర విభాగాల్లో అనువైన ప్రదేశాల్లో ఉద్యోగం సంపాదించుకునేందుకు ఆయా శాఖల్లోని అధికారులు, ఉద్యోగులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తమకు అనుకూలమైన మంత్రులు, ఎమ్మెల్యేల ద్వారా సిఫారసు లేఖలు పొందేందుకు క్యూ కడుతున్నారు. వారం క్రితం అన్ని విభాగాల్లో ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం అన్ని శాఖల్లో ఏ విధంగా అధికారులు, ఉద్యోగుల బదిలీలు చేపట్టాలో ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. మే 31 నాటికి ఒకే స్థానంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న ఉద్యోగులను తప్పనిసరిగా మార్చాలని ప్రభుత్వం ఆయా శాఖల జిల్లా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఐదేళ్ల సర్వీసు పూర్తి కాని ఉద్యోగులు కూడా వివిధ కారణాల వల్ల బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ప్రస్తుత బదిలీల్లో అనారోగ్యంతో బాధపడే వారికి ప్రభుత్వం ప్రాధాన్యం కల్పిస్తూ నిబంధనల్లో ఉత్తర్వులు జారీ అయ్యాయి. అంధత్వం, మానసిక దివ్యాంగ పిల్లలు కలిగి ఉండి, వైద్య వసతి కలిగిన ప్రదేశాలకు వెళ్లివారికి బదిలీల్లో ప్రాధాన్యం కల్పించనున్నారు. గిరిజన ప్రాంతాల్లో రెండేళ్ల కంటే ఎక్కువ కాలం పని చేసిన ఉద్యోగులు 40 శాతం పైగా దివ్యాంగత్వం కలిగిన వారు దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, ఓపెన్ హార్ట్ సర్జరీ, న్యూరో సర్జరీ, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ తదితర ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు కారుణ్యా నియామకాల ద్వారా నియమితులైన వితంతు ఉద్యోగిణులకు బదిలీల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. దివ్యాంగ ఉద్యోగులు కోరుకుంటే తప్ప వారిని బదిలీ చేయకూడదని ప్రభుత్వం మార్గదర్శకాలలో స్పష్టం చేసింది. బదిలీకి దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే 2వ తేది వరకు అవకాశం ఉంది.

22న కురువ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కర్నూలు ఎడ్యుకేషన్, మే 19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో పదో తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన కురువ విద్యార్థులకు ఈ నెల 22న ప్రతిభా పురస్కారాలు ప్రధానం చేయనున్నట్లు జిల్లా కురువ సంఘం అధ్యక్షుడు పత్తికొండ శ్రీనివాసులు, అసోసియేట్ అధ్యక్షుడు గుడిసె శివన్న, ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కర్నూలు పార్లమెంటు సభ్యుడు బస్తి పాటి నాగరాజు హాజరవుతారన్నారు. ఈనెల 22న కర్నూలు జిల్లా పరిషత్ ఆవరణలోని మండల ప్రజా పరిషత్ సమావేశ భవనంలో కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

నేడు ఆదోనిలో మినీ మహానాడు

ఆదోని , మే19 (ఆంధ్రజ్యోతి): కర్నూలు రోడ్డులో ఉన్న జేబీ గార్డెన్స్‌లో మంగళ వారం మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతందని అన్ని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

భక్తుల కోసం చలివేంద్రం ఏర్పాటు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): లక్ష్మమ్మ రథోత్సవం సందర్భంగా జంగమ వీరశైవ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు దివంగత ఎండీ బద్రీనాథ్ స్వామి జ్ఞాపకార్థం ఎండీ బసవరాజు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే పార్థసారథి సోమవారం ప్రారంభించారు. బీజేపీ నాయకుడు విట్టా రమేష్, జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, టీడీపీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కన్నె జగదీష్, విరుపాక్షి పాల్గొన్నారు.

అరెస్టు చేయాలి


ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు

పత్తికొండ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆలూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు, చిప్పగిరి లక్ష్మీనారాయణను హత్యచేసిన సూత్రధారులను అరెస్టు చేయాలని దళిత సంఘాల జేఏసీ నాయకులు ప్రకాష్, టీఎం రమేష్ మాదిగ, సుబాష్ చంద్ర మాదిగ, రాజేంద్ర మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం అంబేడ్కర్ సర్కిల్ నుంచి నాలుగు స్థంభాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పోలీసులు కిరాయి హంతకులను మాత్రమే అరెస్టు చశారని సూత్రధారులుగా ఉన్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, తమ్ముడు నారాయణస్వామిని విచారణ చేయాలన్నారు. గుమ్మనూరు జయరాంను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని కోరారు. అనంతరం ఆర్డీవో భరత్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. గంధం శ్రీనివాసులు, స్వామిదాస్, కత్తి రామాంజనేయులు, పెద్దరాజు, ఎల్లప్ప, మద్దిలేటి తదితరులు ఉన్నారు.

నాణ్యత ఉంటే కొనుగోలు చేస్తాం

ఆదోని/ఆదోని రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): జొన్నలు నాణ్యమైనవిగా ఉంటే ప్రభుత్వ ఆదేశాల మేరకు పౌరసరఫరాల శాఖ ద్వారా కొనుగోలు చేస్తామని జాయింట్ కలెక్టర్ బి. నవ్య హామీ ఇచ్చారు. సోమవారం


రైతులతో మాట్లాడుతున్న జేసీ, సబ్ కలెక్టర్

ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, అగ్రికల్చర్ ఏడీఏ బాలవర్ధరాజు, ఏవో ఆశోక్ కుమార్‌రెడ్డి, తహసీల్దార్ శివరాముడుతో కలిసి 104 బసాపురంలో పర్యటించారు. జొన్న పండించిన రైతులతో సమీక్ష నిర్వహించారు. బసాపురం, సంతేకుడ్లూరు, పెద్దహరివాణం, చిన్నహరివాణం, చిన్న గొన్నేహాళ్ గ్రామాలకు చెందిన 68మంది రైతులు 2024-25 రబీలో 2 వేల క్వింటాళ్ల జొన్న దిగుబడి వచ్చిందన్నారు. క్వింటానికి రూ.3,371 లు చెల్లించి పౌరసరఫరాల ద్వారా కొనుగోలు చేస్తామని తెలిపారు. రైతులు రైతు భరోసా కేంద్రాల్లో విక్రయించాలన్నారు.

22న హనుమాన్ జయంతి

తుగ్గలి, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం శివారులో వెలసిన కృష్ణాపురం ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 22న హనుమాన్ జయంతి నిర్వహిస్తున్నట్లు ప్రహ్లాద్ సోమవారం తెలిపారు. ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం రథోత్సవం ఉంటుందన్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాల తోపాటు అన్నదానం చేస్తామన్నారు.

సేంద్రియ ఎరువుతో భూమి సారవంతం

మద్దికెర, మే 19 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుతో భూమి సారవంతం అవుతుందని ఏవో రవి పేర్కొన్నారు. సోమవారం రైతు సేవా కేంద్రంలో మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్నాయని, సాగుకు ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. రైతులు పంటకోత అనంతరం వ్యర్థాలను తగలబెట్టకుండా భూమిలో కలియదున్నితే సేంద్రియ ఎరువుగా మారి భూమి సారవంతమవుతుందన్నారు. మట్టి నమూనాల సేకరణకు భూసార పరీక్షలకు ఇదే సరైన సమయమని, వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. భూసార పరీక్ష ఫలితాలతో భూమి ఏ పంటకు అనువుగా ఉందో తెలుస్తుందని, అందుకు తగ్గ పంటలు సాగు చేసుకునే వీలుంటుందన్నారు.



మద్దికెర నుంచి బురుజుల వరకు 12 కి.మీ.ల దారి అధ్వానంగా ఉండేది. కొందరు వాహనదారులు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు ప్రమాదాల బారిన పడ్డారు. ప్రజల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే శ్యాంబాబు రూ.5కోట్ల నిధులు మంజూరు చేయించడంతో నూతన రహదారిని నిర్మించారు. - మద్దికెర.



ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- జాయింట్ కలెక్టర్ నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ప్రజల నుంచి వినతుల స్వీకరణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అధికారులు

ఆదోని , మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ నవ్య, సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. సోమవారం కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. మండలాల ప్రజల నుంచి సబ్ కలెక్టర్ వినతిపత్రాలను స్వీకరించారు. మండలంలోని సంబంధిత శాఖల అధికారులకు సమస్యలను తెలియజేస్తూ గడువు లోపు పరిష్కరించాలన్నారు. వసుంధర, సర్వేయర్ వేణు సూర్య, డీఎల్‌పీవో నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ పద్మజ, ఆర్‌టీసీ డీఎం మహ్మద్ రఫీ, డీటీ గుండాల నాయక్ పాల్గొన్నారు.

పౌర సరఫరాల గోదాము తనిఖీ

పట్టణంలోని పౌర సరఫరాల గోదాంను సోమవారం జేసీ బి.నవ్య, ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ తనిఖీ చేశారు. జేసీ నవ్య, రేషన్ నిల్వ, రికార్డులను క్షేత్రస్థాయి లో పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ రేషన్ పంపిణీలో పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివరాముడు, డీటీ రవీంద్ర రెడ్డి, పౌరసరఫరాల డీటీ వలిబాషా, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రచ్చబండ కట్ట ఏర్పాటు చేయండి

మద్దికెర, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మెయిన్ బజారులో రచ్చబండ కట్టను ఏర్పాటు చేయాలని రైతులు, ప్రజలు కోరారు. సోమవారం కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్, సర్పంచ్ బండారు సుహాసిని, ఉప సర్పంచ్ కవిరెడ్డి కృష్ణకు వినతి పత్రం అందజేశారు. స్పందించిన అధికారులు పంచాయతీ తీర్మాణంలో చర్చించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఉద్యోగుల సమస్యలపై ఉద్యమించాలి

- సంఘం జిల్లా అధ్యక్షుడు రఘుబాబు

ఆలూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల సమస్యలపై ఉద్యమించాలని ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రఘుబాబు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో సమావేశం నిర్వహించారు. క్షేత్రస్థాయి



మాట్లాడుతున్న రఘుబాబు

సిబ్బందికి ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని, మహిళా ఉద్యోగులకు పనిఒత్తిడి తగ్గించాలన్నారు. ఆరోగ్యశాఖలో యాప్‌ల సంఖ్యను కుదించాలని, ప్రభుత్వంతో పోరాడి సాధిస్తామ న్నారు. అనంతరం ఆలూరు తాలూకా ఏపీ హంస నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తాలూకా అధ్యక్షుడిగా కె.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా ఉమాపతి, సభ్యులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా నాగన్న వ్యవహరించారు. జిల్లా కార్యదర్శి షఫీ, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధితుడికి చెక్కు పంపిణీ

దేవనకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలతలమర్రి గ్రామానికి చెందిన తగరం గోపాల్ అప్లేస్టిక్ అనీమియా వ్యాధితో బాధపడుతూ కర్నూలు పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం రూ.5లక్షల మంజూరు చేయడంతో


చెక్కు పంపిణీ చేస్తున్న జ్యోతి, బొజ్జమ్మ

పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు, వాల్మీకి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బొజ్జమ్మ, జ్యోతి బాధితుడికి చెక్కు అందజేశారు. కన్వీనర్ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర ఉప సర్పంచ్‌గా కవిరెడ్డి కృష్ణ

మద్దికెర, మే 19 (ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా కవిరెడ్డి కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఎన్నికల అధికారి రంగస్వామి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయంలో ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహించారు. 18


డిక్లరేషన్ తీసుకుంటున్న కవిరెడ్డి కృష్ణ

మంది సభ్యులకుగాను, 14 మంది హాజరయ్యారు. కవిరెడ్డి కృష్ణను ఉప సర్పంచ్‌గా సభ్యుడు మల్లికార్జున ప్రతిపాదించగా 11 మంది మద్దతు తెలుపుతూ చేతులెత్తారు. దీంతో కృష్ణ ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి రంగస్వామి, డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ ధ్రువీకరణ పత్రం అందజేశారు. సర్పంచ్ బండారు సుహాసిని, జడ్పీటీసీ సభ్యుడు డి.మురళిధర్ రెడ్డి, మాజీ ఎంపీపీలు మల్లికార్జున యాదవ్, జమేదార్ నీలకంఠ రాయుడు, మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్లు అభినందించారు.

66 మంది గైర్హాజరు

వెల్దుర్తి, మే 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, అంబేడ్కర్ గురుకుల పాఠశాల (ఏ,బీ రెండు పరీక్షా కేంద్రాలు), జడ్పీ బాలికల పాఠశాలతో సహా నాలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా మొదటి రోజు 210 విద్యార్థులకు గాను 144 మంది హాజరయ్యారు. 66 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈవో ఇందిర తెలిపారు.

ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోండి

హొళగుంద, మే 19 (ఆంధ్రజ్యోతి): ఇంటి స్థలం లేని నిరుపేదలు దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ నిజాముద్దీన్ సూచించారు. సోమవారం మాట్లాడుతూ ప్రభుత్వం మూడు సెంట్ల స్థలం ఇస్తుందన్నారు. గ్రామాల్లో ఇంటి స్థలం లేని వారు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులకు స్థలం మంజూరు చేస్తామన్నారు.

పనిభారం తగ్గించాలి

హాలహర్వి, మే 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు పనిభారం తగ్గించాలని సచివాలయ సంఘం అధ్యక్షుడు బాషా డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ జీవో నెం.4తో పనిభారం పెరిగిందని, ప్రభుత్వం వెంటనే పదోన్నతులు కల్పించాలని కోరారు.

22న జాబ్ మేళా

ఆలూరు రూరల్, మే19 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్.ఆనంద్ రాజ్ కుమార్, ప్రిన్సిపాల్ వి.రమాదేవి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని 12 కంపెనీలు పాల్గొంటారని చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ చదివి 18-35 సంవత్సరాలోపు అభ్యర్థులు విద్యార్హత జిరాక్స్, ఆధార్, రెండు ఫోటోలతో రావాలని కోరారు.వివరాలకు 6300230937 నెంబర్లో సంప్రదించాల న్నారు.

ఎరువుల ధరలను తగ్గించాలి

ఆదోని రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతోందని ఎరువుల, విత్తనాల ధరలను తగ్గించాలని సీపీఎం నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం మాట్లాడుతూ, ఉపాధి పథకానికి నిధులు పెంచాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యూలర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.


హొళగుందలో ఎంపీడీవో మాత్రమే ఉన్నారు

మారని అధికారుల తీరు

హొళగుంద , మే19 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను పరిష్కార వేదికకు కొందరు అధికారులు ఇలా వచ్చి అలా వెళ్లిపోతుండటంతో రైతులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. సోమవారం హొళగుందలో నిర్వహిచిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 16 ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు పాల్గొనాల్సి ఉండగా ఎంపీడీవో విజయలలిత మాత్రమే పాల్గొన్నారు. కొందరు అధికారులు సంతకాలు చేసి వెళ్లిపోగా, మరికొందరు పత్తాలేరు. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో విజయలలితను వివరణ కోరగా వివిధ శాఖలకు చెందిన అధికారులు కొందరు హాజరు పట్టికలో సంతకాలు చేసి వెళ్లిపోయారని తెలిపారు.

తుగ్గలి: ప్రజా పరిష్కార వేదికకు హాజరుకావలసిన అన్ని శాఖల అధికారులు పత్తాలేరు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి సోమవారం తుగ్గలిలో తహసీల్దార్, కొందరు వీఆర్వోలు తప్ప ఎవరూ కనిపించలేదు. దీంతో ప్రజలు, రైతులు తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం ఇచ్చి వెనుదిరిగారు.


పనులను పరిశీలిస్తున్న బోర్డు అధికారులు

నాణ్యత పాటించాలి

హాలహర్వి, మే19(ఆంధ్రజ్యోతి): దిగువ కాలువ ఆధునికీకరణ పనుల్లో నాణ్యత పాటించాలని తుంగభద్ర బోర్డు డీఈ హసీన్‌బాషా సూచించారు. సోమవారం బాపురం వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పనులు వేగవంతం చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. పనులు ఆలస్యంగా చేస్తే రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉంటుందని, పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. కాంట్రాక్టర్ పనుల్లో నాణ్యత పాటించకపోతే ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఈ కిరణ్, లస్కర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మినీ మహానాడును జయప్రదం చేయండి


మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి వీరభద్రగౌడ్

ఆలూరు, మే19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించనున్న టీడీపీ మినీ మహానాడును జయప్రదం చేయాలని నియోజకవర్గంలోని ఆ పార్టీ ఆలూరు ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ కోరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో కన్వీనర్లు, కూటమి నాయకులు, జూనియర్, ఎన్టీఆర్, నందమూరి అభిమానులు, సర్పంచులు, ఎంపీటీసీలతో సమావేశం నిర్వహించారు. టీడీపీ అధినాయ కత్వం ఆదేశాల మేరకు మినీ మహానాడును నిర్వహిస్తున్నామ న్నారు. ముఖ్య అతిథిగా ఎంపీ బస్తిపాటి నాగరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, వాల్మీకి కురువ కార్పొరేషన్ల చైర్మన్‌లు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, దేవేంద్రప్ప, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హాజరవుతారన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం తొలిసారి నిర్వహించే ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు అందరూ హాజరుకావాలని కోరారు. కన్వీనర్ అశోక్, మోడల్ స్కూల్ చైర్మన్ విశ్వేశ్వరస్వామి, నాయకులు తిమ్మయ్య, రాముయాదవ్, హనుమప్ప, కిట్టు, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ

దేవనకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నేలతలమర్రి గ్రామంలో అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం నిర్వహించారు. ఆలయంలో మూడు రోజులుగా దీక్షలు, హోమాలు నిర్వహించి, ఉదయం విగ్రహంతో పాటు ధ్వజస్తంభం, బొడ్రాయిని ప్రతిష్ఠించారు. ఆడపడచులకు ఒడిబియ్యం పోయడంతో పండుగ వాతావరణం కనిపించింది.


ధ్వజస్తంభ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

మోటివేషన్ క్లాసులను వినియోగించుకోవాలి


మాట్లాడుతున్న లక్ష్మన్న

పత్తికొండ టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు మోటివేషన్ క్లాసులను వినియోగించుకోవాలని యువస్పందన సొసైటీ ఉపాధ్యక్షుడు లక్ష్మన్న, కార్యదర్శి గిరీష్ నాయుడు సూచించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 21న పట్టణంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న డా.సయ్యద్ హమీద్ చేత మోటివేషన్ క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. మంగళ వారం సాయంత్రం 5 గంటలోపు యువ స్పందన స్టడీ సర్కిల్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. సభ్యులు రమేష్, రాజేశ్వరి పాల్గొన్నారు.

నిస్వార్థ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య


దేవనకొండలో నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

దేవనకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): పుచ్చలపల్లి సుందరయ్య నిస్వార్థ నాయకుడని సీపీఎం జిల్లా నాయకుడు వీరశేఖర్ అన్నారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో సుందరయ్య 40వ వర్థంతి సందర్భంగా నివాళి అర్పించారు. దేశప్రజలే తన పిల్లలుగా భావించి, సమసమాజ స్థాపన కోసం కులమతాలకతీతంగా విద్య, వైద్యం అందలాని కృషి చేశారన్నారు. ప్రజా సమస్యలను పార్లమెంట్‌లో క్షుణ్ణంగా అందరికీ అర్థమయ్యేలా మట్లాడిన వక్తగా కొనియాడారు. కార్యక్రమంలో పెదరాయుడు, రంగన్న, రాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: పట్టణంలోని జ్యోతిబసు భవన్‌లో సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి నిర్వహించారు. పార్టీ నాయకులు నారాయణస్వామి షాకిర్ మాట్లాడుతూ దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సుందరయ్య పోరాడారన్నారు. కృష్ణ, ఈశ్వర్ గౌడ్, విఠల్ డీవైఎఫ్ఐ నాయకులు షైన గోవర్ధన్, విష్ణు మూర్తి పాల్గొన్నారు.



దేవనకొండ ఎస్సీకాలనీలో రహదారిపై పారుతున్న మురుగు

దేవనకొండ, మే 19 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రోడ్డుపైనే మురుగు సపారుతోంది. దీంతో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. డెంగీ, మలేరియా నివారిస్తామని ఉపన్యాసాలు ఇచ్చే అధికారులకు ఇవి కనిపించడం లేదా? అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని, దోమలు పెరిగాయని అధికారులు వెంటనే పారిశుధ్య పనులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రాలయంలో కబ్జా పర్వం

● రోడ్లను ఆక్రమించిన దుకాణాల నిర్వాహకులు ● తోపుడు బండ్ల వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు ● పట్టించుకోని అధికారులు



రోడ్డుపైనే నిలిపిన వాహనాలు



నది ఒడ్డున టెంట్ వేసి రోడ్డును కబ్జా చేసిన దృశ్యం



అన్నపూర్ణ భోజన శాల వద్ద భక్తుల రాకపోకలకు అడ్డంకిగా మారిన దుకాణాలు, తోపుడు బండ్లు

మంత్రాలయం, మే 19 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ఆర్అండ్‌బీ, గ్రామ పంచాయతీ, శ్రీమఠం రోడ్లలో యథేచ్ఛగా కబ్జాల పర్వం సాగుతోంది. ప్రధాన రోడ్లలో ఇరువైపులా దుకాణాల యజమానులు ఆర్అండ్‌బీ రోడ్డును తోపుడు బండ్లకు నెలకు రూ.80వేలకు ఆర్అండ్‌బీ స్థలాన్ని అద్దెకు ఇచ్చి యథేచ్ఛగా దోచుకుంటున్నట్లు సమాచారం. దీనికి తోడు లాడ్జీలను అద్దెకు తీసుకున్న వారు వాహనాలు ప్రధాన రోడ్డుపై ఉంచడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. సొంత దుకాణాలు, ప్రైవేటు లాడ్జీల యజమానులు ఆర్అండ్‌బీ స్థలాలనే అద్దెకు ఇస్తూ అక్రమ సంపాదనతో లక్షల రూపాయలు సంపాదిస్తున్నారు. నదీ తీరంలో శ్రీమఠం కేటాయించిన దుకాణాల స్థల విస్తీర్ణానికి మూడు రెట్లు ముందుకు వచ్చి రోడ్డును దర్జాగా ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. నది ఒడ్డున తాత్కాలిక టెంట్లు వేసి పది నుంచి 20 దాకా కుర్చీలు పెట్టి హోటళ్లు నిర్వహిస్తూ విశాలమైన స్థలాన్ని కబ్జా చేసి ఇరుకుగా మార్చేశారు. అదే విధంగా శ్రీనికేతన్ రహదారిలో అన్నపూర్ణ భోజన శాల, లాడ్జీ ఏరియాల్లో తమ దుకాణాలను రోడ్లపై పెట్టడంతో భోజనాలకు వెళ్లే భక్తులకు అడ్డంకిగా మారింది. పట్టించుకోవాల్సిన ఆర్అండ్‌బీ, పంచాయతీ, శ్రీమఠం అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండడంతో కబ్జాల పర్వం, ఆక్రమణలు అధికమయ్యాయి. బస్టాండుకెళ్లే రహదారిలో మురుగు కాలువలకు గోడలు కట్టి హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్, ఐస్‌క్రీమ్స్, టిఫిన్ సెంటర్లు, పూల అంగళ్లు నిర్వహిస్తున్నారు. తోపుడు బండ్లు అడ్డదిడ్డంగా నడుపుతున్నా అడిగే వారే లేరని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆదివారం, గురువారం, పలు శుభదినాలు, సెలవు దినాల్లో మంత్రాలయం వచ్చే భక్తులు దారి లేక కిక్కిరిసి ఇబ్బందులు పడుతున్నారు. నది తీరంలో ఆహ్లాదకర వాతావరణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు శ్రీమఠం అధికారులు విశాలమైన రోడ్లు ఏర్పాటు చేసినప్పటికీ దుకాణాల యజమానులు రోడ్లపైకి వచ్చి ఆక్రమణలు చేపడుతూ వ్యాపారాలు చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ పంచాయతీ , శ్రీమఠం అధికారులు స్పందించి కబ్జాలు, ఆక్రమణలను తొలగించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలని భక్తులు, గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పంచాయతీ స్థలాలను ఆక్రమిస్తే తొలగిస్తాం



మంత్రాలయం గ్రామ పంచాయతీ స్థలాలను ఆక్రమించిన వాటిని గుర్తించి తొలగిస్తాము. మంత్రాలయంలో పరిశుభ్రత ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు కృషి చేస్తాం. ఆక్రమాలకు పాల్పడి విశాలమైన రోడ్లను ఇరుకు రోడ్లకు ఆమార్చే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాము.

-తెల్లబండ్ల భీమయ్య, సర్పంచ్, మంత్రాలయం

కబ్జా చేస్తే నోటీసులు ఇచ్చి కూలుస్తాం



మంత్రాలయం పుణ్యక్షేత్రంలో విశాలమైన సీసీ రోడ్డును నిర్మించాము. కొంత మంది డ్రైనేజీపై గోడలు కట్టడం, రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, లాడ్జీలు అక్రమంగా ఏర్పాటు చేసిన వారిని గుర్తించి నోటీసులు ఇచ్చి కూల్చివేస్తాం. ఆర్అండ్‌బీ రోడ్లను ఆక్రమిస్తే సహించేది లేదు, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తాం. ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారించి ఆర్అండ్‌బీ స్థలాలను బాడుగలకు ఇచ్చి దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

-నాగరాజు, ఆర్అండ్‌బీ డీఈ, ఎమ్మిగనూరు

శ్రీమఠం దుకాణాలు హద్దులోనే ఉండాలి



మంత్రాలయం నది తీరంలో ప్రధాన రహదారులు, మఠం తరుపున తీసుకున్న దుకాణాలు తమ పరిధిలోనే నిర్వహించాలి. ముందు రోడ్లపైకి వచ్చి ఆక్రమణలకు గురి చేస్తే ల్యాండ్ సెక్షన్, షాపింగ్ అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించే విధంగా ఆదేశాలు ఇచ్చాం, కొంత మంది దుకాణాదారులు రోడ్లను ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం.

- వెంకటేశ్ జోషి, శ్రీమఠం మేనేజర్, మంత్రాలయం

ప్రారంభమైన 'పది' సప్లిమెంటరీ పరీక్షలు

కౌతాళం, మే 19(ఆంధ్రజ్యోతి): మార్చిలో జరిగిన పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేని విద్యార్థులకు సోమవారం నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమైనట్లు మండల విద్యాధికారిణి-2 శోభారాణి తెలిపారు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ మండలంలో పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు మండల కేంద్రమైన కౌతాళంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రతిభ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా మొదటి రోజు తెలుగు పరీక్షకు 119 విద్యార్థులు హజరుకావాల్సి ఉండగా 79 మంది మాత్రమే హజరయ్యారని మిగిలిన 49 మంది గైర్హజరైనట్లు తెలిపారు.ఈ పరీక్షలు ఈ నెల 26వరకు ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-45 వరకు జరుగుతాయని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రమును ఆమె తనిఖీ చేశారు.

ఓటర్ల జాబితాలో తప్పిదాలు ఉంటే సరి చేస్తాం

● స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కలెక్టర్ అనూరాధ

మంత్రాలయం, మే 19 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే సరిచేస్తామని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మంత్రాలయం రిటర్నింగ్ అధికారి అనూరాధ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలనాయకులు, బీఎల్‌వోలు, నాలుగు మండలాల తహసీల్దార్లతో ఓటరు జాబితాపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఓటరు జాబితాలో అవకతవకలు, మృతులు, 18ఏళ్లు నిండిన వారు, కుటుంబంలో వేరువేరుగా ఓటరు నమోదై ఉంటే అలాంటివి తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మంత్రాలయం, కోసిగి, పెద్దకడుబూరు తహసీల్దార్లు ఎస్.రవి, రుద్రగౌడు, గీత, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జీకే గురురాజరావు, ఆర్ఐ ఆదాం, వీఆర్వోలు భీమన్నగౌడు, భీముడు, ఆనంద్, నరసప్ప, ప్రభాకర్, శ్వేత, జయరామిరెడ్డి, వీరేష్, ఎంపీటీసీ వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

ఎమ్మిగనూరు టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వేతనాలు మరియు న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని మోకాళ్లపై కూర్చుని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ నిరసన తెలిపారు. యూనియన్ అధ్యక్షులు నారాయణ, నాయకులు .రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు 13వ రోజు సమ్మె కొనసాగించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర, నరసప్ప, విజయ్‌కుమార్, శ్రీరాములు, పంపాపతి, సాయి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తాం

నందవరం, మే 19(ఆంధ్రజ్యోతి): గురురాఘవేంద్ర ప్రాజెక్టు సమస్యలను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి దృష్టికి తీసుకెళ్తామని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ కాశీంవలీ తెలిపారు. ఆదివారం మండలంలోని చిలకలడోన రిజర్వాయర్‌ను టీడీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా క్లస్టర్ ఇన్‌చార్జ్ మాట్లాడుతూ గురురాఘవేంద్ర ప్రాజెక్టుకు విద్యుత్ అంతరాయం ఉందని సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ రామకృష్ణరెడ్డి, చిన్నకొత్తిలి సత్యారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మాచాపురం గ్రామ అధ్యక్షుడు రంజాన్ పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్షుడిగా చావిడి వెంకటేశ్



కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీలుగా ఎన్నికైన చావిడి వెంకటేశ్, వలకలదిన్నె వెంకటేశ్

కోసిగి, మే 19 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 18న విజయవాడ క్లబ్‌లోని స్టేట్ కబడ్డీ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏకేఎఫ్ఐ అండ్ ఎస్ఏ ఏపీ వారి ఆధ్వర్యంలో ఆంధ్ర స్టేట్ కబడ్డీ ఎలక్షన్ నిర్వహించారని తెలిపారు. అందులో కర్నూలు జిల్లా కబడ్డీ క్రీడకు అధ్యక్షుడిగా మాలపల్లికి చెందిన చావిడి వెంకటేశ్, కోసిగి మండలం కోల్‌మాన్‌పేట గ్రామానికి చెందిన జిల్లా కబడ్డీ జాయింట్ సెక్రటరీగా వలకలదిన్నె వెంకటేశ్ ఎంపికయ్యారని ఆంధ్ర స్టేట్ కబడ్డీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ తెలిపారు. జిల్లా అధ్యక్ష, జాయింట్ సెక్రటరీలుగా ఎన్నికైన చావిడి వెంకటేశ్, వలకలదిన్నె వెంకటేశ్ మాట్లాడుతూ కబడ్డీ క్రీడకు కర్నూలు జిల్లా పెట్టింది పేరు అని కబడ్డీ క్రీడలో కర్నూలుకు రాష్ట్రంలోనే మంచి పేరు తెస్తామని తెలిపారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి

మంత్రాలయం, మే 19 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయయ వర్ధంతి నియోజకవర్గలో ఘనంగా జరిపారు. సోమవారం సీపీఎం మండల నాయకులు అనిల్, ప్రాణేష్, అంజి, లక్ష్మన్నలు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నర్సప్ప ఆచార్, ఇబ్రహీం, దేవపుత్ర తదితరులు పాల్గొన్నారు.

●గోనెగండ్ల

సుందరయ్య స్ఫూర్తితో కులవివక్షతపై పోరాటం కొనసాగించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్, సీపీఎం నాయకులు నబిరసూల్, వేణు అన్నారు. సోమవారం గోనెగండ్లలో పుచ్చల పల్లి సుందరయ్య 40వ వర్ధంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బాబు, ఆది, నల్లారెడ్డి, రాజు, వీరేష్, వీరా, జీవన్, నాగరాజు పాల్గొన్నారు.

● పెద్దకడుబూరు

కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్యను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం నాయకులు తిక్కన్న, పరమేష్ లు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పెద్దకడుబూరులోని బస్టాండ్ ఆవరణలో 41వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

● కోసిగి

సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్, సీపీఎం మండల కన్వీనర్ రాముడు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పూడికతీత పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మేజర్ డ్రైన్‌లలో పూడికతీత పనులను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు..ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడుతూ రాబోయో వర్ష కాలం దృష్ట్యా మేజర్ డ్రైన్‌లలో పూడికతీత పనులను రూ. 7లక్షలతో ప్రారంభించామని, తద్వారా కాల్వల్లో సిల్టు లేకుండా వర్షపు నీటికి అడ్డులేకుండా, రోడ్లపైకి రాకుండా, డ్రైనేజి పారుటకు ముందస్తు చర్యల్లో భాగంగా పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఏఈ మదన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

బైకులో దూరిన నాగుపాము



బైకులో దూరి బుసలు కొడుతున్న నాగుపాము

పెద్దకడుబూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్డిమేకల గ్రామానికి చెందిన రైతు మల్లయ్య తన బైకును నిలిపి పొలం పనుల్లో నిమగ్నమైన సమయంలో నాగుపాము అతని బైకులోకి వెళ్లింది అది గమనించని రైతు అప్పటికే బైకుపై గ్రామానికి రెండు సార్లు వెళ్లి వచ్చాడు. అదృష్టవశాత్తు మల్లయ్యకు పాము ఎలాంటి హానీ చేయలేదు. అయితే ఇంటికి వెళ్లే సమయంలో బైకును ఆన్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా నాగుపాము తోక కనిపించింది. అనుమానం వచ్చిన మల్లయ్య బైకుసీటును తెరవగా దాదాపు ఐదు అడుగుల పొడవు ఉన్న నాగుపాము ఒక్కసారిగా బయటకు వచ్చి బుసలు కొట్టింది. తోటి రైతులతో కలిసి పామును బైకు సీటు నుండి బయటకు తీశారు. మల్లయ్యకు పెళ్లై ఏడు రోజులు అయ్యింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు

ఉరుకుందలో ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం, మే 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలలో ఒకటైన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయం భక్తులతో సందడిగా మారింది. ఆలయ అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌ను తెల్లవారు జామునే శుద్దజలంచే పూజించి ప్రత్యేక పుష్పాలతో ఆలంకరించి మహా మంగళహారతితో పూజించి భక్తులకు దర్శనం కల్పించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు అన్నదానం ఏర్పాటు చేశారు.

'విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోవాలి'

పెద్దకడుబూరు , మే 19(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్‌యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మబ్బు ఆంజనేయులు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పెద్దకడుబూరులో రైతులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రానికి విద్యుత్ ఏఈ ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో తెలియని పరిస్థితి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు దస్తగిరి, నరసింహులు, నరసయ్య, లక్ష్మన్న ఆంజనేయ, రాజు, మూకన్నలు పాల్గొన్నారు.

కన్నుల పండువగా భువనేంద్ర తీర్థుల ఆరాధన మహోత్సవాలు



సంస్థాన పూజ చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

మంత్రాలయం, మే 19 (ఆంధ్రజ్యోతి) : మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీ భువనేంద్ర తీర్థుల ఆరాధన మహోత్సవాలు కన్నుల పండువుగా జరుపుకున్నారు. సోమవారం వేదపండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు, వెండి ఆభరణాలతో పాటు, పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయ మానంగా అలంకరించిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో పండిత కేసరి విద్వాన్ రాజాఎస్ గిరిరాజాచార్, అప్రమేయాచార్ పాల్గొన్నారు.

కనకవీడులో తిక్కలక్ష్మమ్మ ప్రభోత్సవం



కనకవీడులో ప్రభోత్సవంలో పాల్గొన్న భక్తులు

నందవరం, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కనకవీడు గ్రామంలో సోమవారం తిక్క లక్ష్మమ్మ జాతర సందర్భంగా సాయంత్రం ప్రభోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు అమ్మవారికి కుంకుమార్చన, మహాబలికుంభమేళతో భాజభంజత్రీలతో జాతర కార్యక్రమం ప్రారంభించారు. సాయంత్రం జరిగిన ప్రభోత్సవంకు గ్రామ ప్రజలే గాక చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు హజరయ్యారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు కేఆర్‌లక్ష్మీకాంతరెడ్డి, రఘుమూర్తిస్వామి, మండల వైస్‌ఎంపీపీ షేక్‌సాబ్, సర్పంచ్ మద్దయ్య, ఎంపీటీసీ సావిత్రమ్మ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం

ఎమ్మిగనూరు టౌన్,మే 19 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన గోకారి శ్రీధర్ (12) బాలుడు అదృశ్యం అయ్యాడు. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోకారి రంగప్ప కూమారుడు శ్రీధర్ డ్రీమ్స్ డ్యాన్స్ స్కూల్‌లో డ్యాన్స్ నేర్చుకోవడానికి అక్క, తమ్ముడు వెళ్లేవారు. ఆదివారం యథావిధిగా ఎవరి డ్యాన్స్ క్లాస్‌కు వారు వెళ్లగా డ్యాన్స్ క్లాస్ ముగిశాక సోదరి బయట వెచి చూడగా తమ్ముడు ఎంతకీ రాకపోవడంతో వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసింది. వారు ఎంత వెతికినా బాలుడి అచూకీ లభ్యం కాకపోవడంతో సోమవారం సాయంత్రం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సనాతన ధర్మాన్ని పాటించాలి

గోనెగండ్ల, మే 19(ఆంధ్రజ్యోతి): హిందూ దేశంలో సనాతన ధర్మంను పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీటీడీ దేవస్థానం, హింద ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో హనుమాన్ జయంతికి సంబంధించిన బ్యానర్లను ఆయన అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గోరక్షన్‌ప్రముఖ్ శ్రీరాములుయాదవ్, విశ్వహిందూ పరిషత్ ప్రఖండ ఉపాధ్యక్షుడు సత్యనారాయణశెట్టి, ధర్మజాగారణ ప్రముఖ్ దమాం జగదీష్, బీజేపి మండల శాఖ అధ్యక్షుడు మునిస్వామిగౌడ్, రమేష్, శివశంకర్, కోటయ్యశెట్టి, మునెప్ప, గజేంద్ర, రమేష్, పాల్గొన్నారు.

టీడీపీ హలహర్వి గ్రామాధ్యక్షుడిగా ఎర్రన్న

నందవరం, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని హలహర్వి గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా మండ్రి ఎర్రన్నను ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సోమవారం ఎకగ్రీవంగా ఎంపిక చేశారు. గ్రామ టీడీపీ నాయకులంతా కలసి గ్రామ అధ్యక్షుడిగా ఒకరిని ఎంపిక చేసుకోవాలని సూచించగా మాజీ ఎంపీపీ చిన్న నరసింహరెడ్డి తనయుడు రైస్‌మిల్ నారాయణరెడ్డి ఎర్రన్నను సిఫరసు చేయగా అందరు అమోదం తెలపడంతో ఎకగ్రీవంగా ఎంపిక చేశారు. ఇందుకు ఎర్రన్నతోపాటు టీడీపీ నాయకులందరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డికి అభినందనలు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ఎమ్మిగనూరు టౌన్, మే 19 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు పట్టణంలోని న్యూ ఎస్సీ కాలనీ సీసీ రోడ్లు లేక వర్షపు నీటితో గుంతలమయంగా మారిందని అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరించాలని సిపిఐ(ఎంఎల్)న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు సత్యన్న డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ న్యూ ఎస్సీ కాలనీలో మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు .ప్రధానంగా సీసీ రోడ్లు లేకపోవడంతో చిన్నపాటి వర్షాలకే ఇళ్ళలోకి వర్షపు నీరు చేరి కాలనీవాసులు విషజ్వరాల బారిన పడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టియు బాలరాజు, బాలస్వామి, నాగేష్ ,శాంతి, లక్ష్మీ, సులోచన తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు వేయాలని కాలనీవాసుల మొర

పట్టణంలోని గాంధీనగర్‌లో దేవి అపార్ట్‌మెంట్ పక్కన గల కాలనీలో 25 సంవత్సరాల క్రితం రోడ్డు వేశారని, ప్రస్తుతం అ రోడ్డు ఛిద్రమై అధ్వాన్న స్థితికి చేరిందని కాలనీవాసులు ఆవేదన చెందారు. ఇప్పటికైనా అధికారులు,నాయకులు స్పందించి రొడ్డు వేయడానికి చర్యలు చేపట్టాలని కోరారు.

రీసర్వేలో తప్పులు లేకుండా చూసుకోవాలి



మాట్లాడుతున్న రీజనల్ డిప్యూటీ డైరెక్టర్

ఎమ్మిగనూరు రూరల్, మే19(ఆంధ్రజ్యోతి): రీ సర్వేలో ఎలాంటి తప్పులు జరగకుండ చూసుకోవాలని రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, నోడల్ అధికారిణి కేజీయాకుమారి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని కొటేకల్లు గ్రామంలో జరిగే రీసర్వేను పరిశీలించారు. అనంతరం సచివాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. మాట్లాడుతూ రీ సర్వేలో ప్రతి రైతుకు న్యాయం జరగాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, తహసీల్దార్ శేషఫణి, ఆర్ఎస్ డీటీ జ్యోతిర్మయి, మండల సర్వేయర్ వాహిద్, సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

యువత వ్యవసాయంపై మొగ్గుచూపాలి



రైతులకు వివరిస్తున్న విద్యార్థులు

ఎమ్మిగనూరు రూరల్, మే19(ఆంధ్రజ్యోతి): నేటి యువత వ్యవసాయంపై మొగ్గు చూపాలని ఆచార్య ఎన్జీరంగ వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ జేసీ దివాకర్‌రెడ్డి, డాక్టర్ లక్ష్మీనారాయణరెడ్డిలు అన్నారు. సోమవారం మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కళాశాల చివరి సంవత్సరం బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థులు గ్రామీణ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మీనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో గ్రామ రైతులు, వ్యవసాయ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.